PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 97, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 28 - మే - 2026 , వెల రూ.5/-



## “గొడ్డలి పార్టీ అంటే సైకోకి కోపం వచ్చింది అంట

**మాది గూగుల్ -- మీది గొడ్డలి**
**మాది ఫైటర్ జెట్స్ -- మీది ఫ్యాక్షన్**
**మాది కియా -- మీది కిడ్నాప్.**

- నీది టెన్త్ పేపర్ కొట్టేసిన హిస్టరీ.. నాది స్టాన్‌ఫోర్డ్ హిస్టరీ: నారా లోకేశ్
- మూడు అక్షరాల బ్రాండ్ సీబీఎన్ అన్న లోకేశ్
- భవిష్యత్తును ముందుగానే చూసే లీడర్ చంద్రబాబు అని కితాబు
- ఇకపై ప్రతి ఎన్నికలో మనమే గెలవాలని పార్టీ శ్రేణులకు పిలుపు మిగతా 2 లో



## చంద్రబాబును ఎదుర్కోవాలి.. ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరాలి

- స్థానిక ఎన్నికలపై జగన్ ఫోకస్
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు
- ఏకగ్రీవ ఎన్నిక జరిగితే నియోజకవర్గ ఇంఛార్జి వైఫల్యంగా పరిగణిస్తానని హెచ్చరిక

# గొడ్డలి పార్టీకి, టీడీపీకి పోలికే లేదు వారిది విధ్వంసమైతే మనది అభివృద్ధి

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు

- ★గొడ్డలి పార్టీకి నెవర్ అగైన్.. ఇగోలకు పోవద్దు.. అభివృద్ధి మంత్రం మనది
- ★ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశామని వెల్లడి
- ★విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని హామీ
- ★ఆరోగ్యకర, సంపన్న, సంతోష ఏపీ నిర్మాణమే కూటమి లక్ష్యమన్న సీఎం



అమరావతి: తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వారిది విధ్వంసకర పాలన అయితే, తమది అభివృద్ధి మంత్రమని స్పష్టం చేశారు. పేదలకు కావాల్సింది సంక్షేమమే తప్ప గొడ్డలివేట్లు కాదని, యువతకు ఉద్యోగాలు కావాలి కానీ గొడ్డలిపోట్లు కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు. “వేట కొడవళ్ల నుంచి గొడ్డలి పార్టీగా మారడం వారి విధానం. ఐటీ నుంచి క్వాంటం వైపు ఎదగడం మన విధానం. బోత్ ఆర్ నాట్ సేమ్” అంటూ టీడీపీ, వైసీపీల మధ్య ఉన్న తేడాను వివరించారు. గొడ్డలి పార్టీ చేసే కుయుక్తులకు భయపడబోమని, ఎన్ని ప్రయత్నాలు చేసినా టీడీపీని అడ్డుకోలేరని హెచ్చరించారు. మిగతా 2 లో

## ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలకు ప్రధాని మోదీ కీలక సూచనలు




- వీలైనంత వరకు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లవద్దని సూచన

ఢిల్లీ: దేశంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు కీలక సూచనలు చేశారు. తీవ్రమైన వేడి పరిస్థితుల్లో

## పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములు

**రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతాం**
**ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయింది**
**జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయి**
**జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశాం**

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.




ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మిగతా 2 లో

## హైదరాబాద్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. ఒక్కరోజులోనే రూ.4,117 కోట్ల విలువైన భూములకు విముక్తి

### కోకాపేట, ఖానామెట్ ప్రాంతాల్లోని చెరువు కబ్జాలను అడ్డుకున్న హైడ్రా

- ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు చేపట్టిన అక్రమ నిర్మాణాల బట్టబయలు
- ఒక్క కోకాపేటలోనే రూ.3,000 కోట్లకు పైగా విలువైన భూములకు విముక్తి
- కబ్జాకు గురైన చెరువులను, రోడ్డు స్థలాలను స్వాధీనం చేసుకుని కంచె ఏర్పాటు



హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో అత్యంత ఖరీదైన ఐటీ కారిడార్, మిగతా 2 లో

## ఆడబిడ్డల వల్లే విజయం.. ఇది మహిళా మహానాడు: చంద్రబాబు

### ఇటీవలి విజయాన్ని దృష్టిలో ఉంచుకుని మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నామన్న చంద్రబాబు

- ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ విధానంతో పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నామని వెల్లడి
- ఏఐ, ఏరోస్పేస్ వంటి రంగాలతో ఏపీని గ్లోబల్ టెక్ హబ్‌గా మారుస్తామని హామీ
- మెగా డీఎస్సీ, పోలీస్ నియామకాలతో యువతకు ఉద్యోగ భరోసా కల్పించామన్న సీఎం
- వచ్చే ఎన్నికల కోసం కాదు, భావితరాల కోసమే తమ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టీకరణ



అమరావతి: ఇటీవలి ఎన్నికల విజయంలో మహిళలు కీలక పాత్ర పోషించారని, అందుకే ఈ మహానాడును వారికి మిగతా 2 లో

## కర్ణాటకలో నాయకత్వ మార్పుపై ఉత్కంఠ.. ‘తర్వాత మాట్లాడతానన్న సిద్ధరామయ్య



కర్ణాటక: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు తీవ్రస్థాయికి చేరాయి. కాంగ్రెస్ అధిష్ఠానంతో భేటీ కోసం ఢిల్లీ వెళ్లి తిరిగి వచ్చిన సీఎం సిద్ధరామయ్య, నాయకత్వ మార్పు ప్రచారంపై స్పందిస్తూ..

## ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా టీమ్ 11 కి బ్యాటింగ్ తప్పదు: మహానాడులో నారా లోకేశ్



- హైబ్రిడ్ మోడల్ లో మహానాడు అనగానే టీమ్ 11 సంబరాలు చేసుకున్నారంట అంటూ ఎద్దేవా
- దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది ఎన్టీఆర్ అని కితాబు
- రాజకీయాల్లో ఎన్టీఆర్ ట్రెండ్ సెట్ చేశారని వ్యాఖ్య మిగతా 2 లో



## టీ-వర్క్స్‌ను తీసుకొచ్చింది కేసీఆరే

- తెలంగాణలో ఆ బీజం ఎన్నో ఏళ్ల క్రితమే కేసీఆర్ నాయకత్వంలో పడింది
- స్టార్టప్‌లకు కేవలం మాటల ప్రోత్సాహం కాదు..
- ప్రపంచ స్థాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అత్యాధునిక టెక్నాలజీ, ఇన్నోవేషన్‌లకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది నాటి భారాస ప్రభుత్వం
- ‘ఎక్స్’లో కేటీఆర్
- ‘కేసీఆర్ ఆలోచనల్లో పుట్టి, యువత చేతుల్లో సాంకేతిక శక్తిగా మారిన గొప్ప వేదిక ఇది

# పోస్టల్ విధానం రద్దు.. ఇకపై పెన్షన్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ

## అర్హులైన వారికి కొత్త పెన్షన్ల మంజూరుకు మొదటి ప్రాధాన్యత

- ➢పంచాయతీ సిబ్బందికి తీపి కబురు చెప్పిన రేవంత్ సర్కారు
- ➢రాష్ట్రంలోని 50 వేల మంది పంచాయతీ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు
- ➢జీతాల కోసం ప్రతినెలా రూ. 50 కోట్ల ప్రత్యేక నిధుల విడుదల
- ➢గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ కీలక నిర్ణయం



హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది మిగతా 2 లో



## సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు.. కాంగ్రెస్ నేతలు సీరియస్

- ‘బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు చట్ట వ్యతిరేకం
- సుమన్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేయాలి
- టీబీజీకేఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి మిలిటెంట్ తరహా కార్యకలాపాలు చేయాలి
- కాంగ్రెస్ పాలన మూడేళ్లకు చేరుకుంటున్న తరుణంలో, గట్టిగా ఒత్తిడి తెస్తేనే కార్మిక వర్గం తమ వైపు నిలుస్తుంది

## టీ-వర్క్స్‌ను తీసుకొచ్చింది కేసీఆరే

హైదరాబాద్: తెలంగాణ భవిష్యత్తును ప్రపంచానికి పరిచయం చేసిన విజన్ పేరు టీ-వర్క్స్ అని... దాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చింది కేసీఆర్ అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. 'ఎక్స్'లో ఆయన టీ-వర్క్స్ పురోగతిపై స్పందించారు. 'కేసీఆర్ ఆలోచనల్లో పుట్టి, యువత చేతుల్లో సాంకేతిక శక్తిగా మారిన గొప్ప వేదిక ఇది. స్టార్టప్‌లకు కేవలం మాటల ప్రోత్సాహం కాదు.. ప్రపంచ స్థాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అత్యాధునిక టెక్నాలజీ, ఇన్నోవేషన్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది నాటి భారాస ప్రభుత్వం. నేడు మొత్తం డ్రోన్లు, డిఫెన్స్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ గురించి మాట్లాడుతుండగా, తెలంగాణలో ఆ బీజం ఎన్నో ఏళ్ల క్రితమే కేసీఆర్ నాయకత్వంలో పడింది. టీ-వర్క్స్ అనేది ఒక భవనం కాదు. తెలంగాణ యువత కలలకు రెక్కలు తొడిగిన ప్రయోగశాల. మేక్ ఇన్ తెలంగాణ అనే ఆత్మవిశ్వాసానికి ప్రతీక. దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ సెంటర్‌ను తీసుకొచ్చి.. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టిన దూరదృష్టి కేసీఆర్‌ది. ఇప్పుడు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్న ఈ సంస్థ తెలంగాణ అభివృద్ధి ఎంత ముందుచూపుతో సాగిందో మరోసారి నిరూపిస్తోంది" అని కేటీఆర్ వివరించారు.

## చంద్రబాబును ఎదుర్కోవాలి.. ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరాలి

అమరావతి: ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత జగన్ పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే క్రమంలో నియోజకవర్గ ఇంఛార్జిలకు ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఏ నియోజకవర్గంలోనైనా, ఏ ఒక్క స్థానంలోనైనా ఎన్నిక ఏకగ్రీవమైతే, దానికి పూర్తిగా ఆ ఇంఛార్జి వైఫల్యంగానే పరిగణిస్తానని తేల్చిచెప్పారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, సమన్వయకర్తలు, ఇంఛార్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీ కుట్రలను ఎదుర్కొని ప్రతిచోటా వైసీపీ జెండా ఎగిరేయాలని పిలుపునిచ్చారు. "ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలి. ఎక్కడైనా ఏకగ్రీవం జరిగితే మాత్రం నేను చాలా సీరియస్‌గా తీసుకుంటా. ఇది మళ్లీ మళ్లీ చెబుతున్నా, అలా జరిగితే అది నియోజకవర్గ ఇంఛార్జి ఫెయిల్యూర్‌గానే భావిస్తా" అని జగన్ స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక, వారికి అవ్వాల్సిన భరోసాపై కూడా జగన్ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఎన్నేలు బలంగా ఉన్న గ్రామాల్లో వారు సూచించే అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ, ఇంఛార్జి అండగా ఉన్నారని ధైర్యాన్ని కల్పించాలని, అలా చేస్తేనే అనిశ్చి ఎన్నికల్లో వారు మనకు అండగా నిలుస్తారని వివరించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తించి, ఎన్నికల బరిలోకి దింపాలని ఆదేశించారు. చంద్రబాబు ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ నేతలకు సూచించారు. ఇందుకోసం 'వెన్నుపోటు రెండేళ్లు' పేరుతో రూపొందించిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లోపాలపై ఇంటింటా చర్చ జరిగేలా చేయడం ద్వారా ప్రజలే ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని నేతలకు స్పష్టం చేశారు.

## 42 మంది పెళ్లికొడుకులు రెడీ... ఒక్క పెళ్లికూతురు లేదు... కొత్త స్కాం!

మధ్యప్రదేశ్: మధ్యప్రదేశ్‌లోని దేవాస్‌లో ఒక సామూహిక వివాహం పేరుతో భారీ మోసం వెలుగుచూసింది. ఓ ఇంటి వాళ్లమవుతామన్న ఆశతో ఆదివారం నాడు పెళ్లి మండపానికి చేరుకున్న 42 మంది వరులు, వారి కుటుంబ సభ్యులకు తీవ్ర పరాభవం ఎదురైంది. అక్కడ వధువులు గానీ, వివాహ వేడుకకు సంబంధించిన ఏర్పాట్లు గానీ లేకపోవడంతో వారంతా షాక్‌కు గురయ్యారు. తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమన్నారు. వివరాల్లోకి వెళితే.. విదిశ జిల్లాకు చెందిన ముఖేశ్, అతని భార్య సునీతా దాస్ బైరాగి నేతృత్వంలోని మధ్యవర్తుల ముఠా ఈ మోసానికి పాల్పడింది. ఇండోర్‌లోని మాళ్వ ఛాయా ఆశ్రమం నుంచి అనాథ యువతులతో పెళ్లిళ్లు జరిపిస్తామని నమ్మబలికారు. ఒక్కో వరుడి నుంచి రూ.15,000 నుంచి రూ.25,000 వరకు 'రిజిస్ట్రేషన్ ఫీజు' పేరుతో వసూలు చేశారు. యువకులను నమ్మించడానికి ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన మోడల్స్ ఫోటోలను చూపించారు. పెళ్లి బట్టలు, ఇతర ఖర్చులన్నీ తామే చూసుకుంటామని, వరులు సాధారణ దుస్తుల్లో వస్తే చాలని చెప్పడంతో వారంతా వారి మాటలు నమ్మారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి కొందరు కార్లు అద్దెకు తీసుకుని, బంధువులతో సహా దేవాస్‌లోని పెళ్లి వేదికకు చేరుకున్నారు. అయితే, తీరా అక్కడికి వచ్చాక నిర్వాహకులు ఎవరూ కనిపించలేదు. వారి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతమంతా బాధితుల ఆవేదనతో నిండిపోయింది. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదుతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితులైన ముఖేశ్, అతని భార్యను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. అయితే, సామాజికంగా పరువు పోతుందనే భయంతో కేవలం 10 కుటుంబాలు మాత్రమే ఇప్పటివరకు అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన గ్రామీణ ప్రాంతాల్లో పెళ్లిళ్ల కోసం ఎదురుచూస్తున్న యువకుల బలహీనతను ఆసరాగా చేసుకుని జరుగుతున్న వ్యవస్థీకృత మోసాలకు అద్దం పడుతోంది.

## కర్ణాటకలో నాయకత్వ మార్పుపై ఉత్కంఠ..

అన్ని విషయాల గురించి గురువారం వివరంగా మాట్లాడతానని తెలిపారు. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో నెలకొన్న ఉత్కంఠ మరింత పెరిగింది. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా నివాళు లర్పించిన అనంతరం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. సీఎం మార్పుపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన నేరుగా సమాధానం ఇవ్వలేదు. "తర్వాత మాట్లాడతా. అన్ని విషయాలు రేపు చెబుతా" అంటూ దాటవేశారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీలోనే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. మంత్రి కేహెచ్ మునియప్ప మాట్లాడుతూ.. సిద్ధరామయ్య ఒక ప్రజా నాయకుడని, రేపు సీఎం ఇచ్చే అల్పాహార విందు తర్వాత నాయకత్వ అంశంపై స్పష్టత వస్తుందని అన్నారు. అయితే, ఎమ్మెల్యే హెచ్‌సీ బాలకృష్ణ మాత్రం డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్న తన డిమాండ్‌కు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. అయితే, సిద్ధరామయ్య రేపు గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరినట్లు తనకు సమాచారం ఉందని మరో ఎమ్మెల్యే హెచ్‌డీ తమ్మయ్య చెప్పడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. ఈ పరిణామాలపై ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అధిష్ఠానమే అంగీకరించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఆరోపించారు. సిద్ధరామయ్య గురువారం లేదా శుక్రవారం రాజీనామా చేయవచ్చని, ఆయన హయాంలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. అయితే, కర్ణాటక రాజకీయాల్లో ఇంతటి ఉత్కంఠ నెలకొన్నప్పటికీ, నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## ఆడబిడ్డల వల్లే విజయం.. ఇది మహిళా మహానాడు: చంద్రబాబు

అమరావతి: ఇటీవలి ఎన్నికల విజయంలో మహిళలు కీలక పాత్ర పోషించారని, అందుకే ఈ మహానాడును వారికి అంకితం చేస్తూ 'మహిళా మహానాడు'గా ప్రకటిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వర్చువల్ విధానంలో జరిగిన మహానాడు సభలో ఆయన మాట్లాడుతూ, మహిళలు, యువత భవిష్యత్తే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం 'స్త్రీ శక్తి' ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 'దీపం 2.0' కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చంద్రబాబు వివరించారు. రానున్న రోజుల్లో 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జెన్ జీ, జెన్ ఆల్ఫా తరం ఆలోచనలకు అనుగుణంగా విధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఏఐ, ఏరోస్పేస్, సెమీ కండక్టర్స్ వంటి ఆధునిక రంగాలకు ఆంధ్రప్రదేశ్‌ను చిరునామాగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' స్థానంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నామని, దీని ద్వారానే 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని అన్నారు. ఫైటర్ జెట్, బుల్లెట్ మోటార్‌సైకిల్ వంటి ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇచ్చామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులను, 5,757 కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేసిందని చంద్రబాబు వెల్లడించారు. తమ పార్టీ వచ్చే ఎన్నికల కోసం కాకుండా, వచ్చే తరాల భవిష్యత్తు కోసం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. ఆకాశమే హద్దుగా అవకాశాలను అందిపుచ్చుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు.

## సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు.. కాంగ్రెస్ నేతలు సీరియస్

హైదరాబాద్: బీఆర్ఎస్ నేత, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సింగరేణి కోల్ బెల్ట్ ప్రాంతంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి (టీబీజీకేఎస్) పూర్వ వైభవం తీసుకురావడానికి సాధారణ నిరసనలు సరిపోవని, ఉధృతమైన క్షేత్రస్థాయి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సింగరేణి ఆఫీసులు తగలబెట్టాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తాజాగా మాట్లాడుతూ.. టీబీజీకేఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి మిలిటెంట్ తరహా కార్యకలాపాలు చేయాలి. సింగరేణి ఆఫీసులు తగలబెట్టాలి. రైల్వే పట్టాలను కోసిపారేయండి. కేవలం అంతర్గత సమావేశాలు, ప్రెస్ మీట్లు, సోషల్ మీడియా ప్రచారాలకే పరిమితం కాకుండా ఇలాంటివి చేయాలి. ప్రజాసమస్యలపై గట్టిగా నిలబడి పోరాడే క్రమంలో కేసులు ఎదురైనా, జైలుకు వెళ్లాల్సి వచ్చినా వెనకడుగు వేయవద్దు. కాంగ్రెస్ పాలన మూడేళ్లకు చేరుకుంటున్న తరుణంలో, గట్టిగా ఒత్తిడి తెస్తేనే కార్మిక వర్గం తమ వైపు నిలుస్తుందని పేర్కొన్నారు. బాల్క సుమన్ వ్యాఖ్యలు కాంగ్రెస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సుమన్ వ్యాఖ్యలపై తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. ఈ క్రమంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ..'బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు చట్ట వ్యతిరేకం. సుమన్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేయాలి. ఆయన వ్యాఖ్యలపై సుమోటోగా కేసు నమోదు చేయాలి. రైలు పట్టాలు కోసేస్తే ఎంత ప్రమాదమో తెలియదా?. పట్టాలు కోసేస్తే యాక్సిడెంట్ అయి ప్రజలు చనిపోతే ఎవరు బాధ్యత వహిస్తారు. సింగరేణి ఆఫీసును తగలపెడతారా? సింగరేణి కార్మికులు సుమన్‌పై తిరగబడాలి. బీఆర్ఎస్ నేతలకు ఎందుకు ఇంత ఫ్రస్టేషన్. రైతులు రోడ్లపైకి రావడం లేదని బీఆర్ఎస్ నేతలే అంటున్నారు. కృత్రిమ ఉద్యమం చేయాలని బీఆర్ఎస్ చూస్తుంది' అంటూ మండిపడ్డారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందిస్తూ..'సుమన్ పేపర్ పులి. ప్రజల కోసం బీఆర్ఎస్ ఏమైనా చేస్తోందా?. బంగారు తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేశారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఖతమైపోయింది. తగలబెట్టడం, కూలగొట్టడం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ముఖ్య నేతలు మాట్లాడాలి' అని డిమాండ్ చేశారు

### పోస్టల్ విధానం రద్దు.. ఇకపై పెన్షన్లు

## నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ

మొదటి పేజి తరువాయి

గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా, ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. ఒక్కరోజులోనే రూ.4,117 కోట్ల విలువైన భూములకు విముక్తి

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో అత్యంత ఖరీదైన ఐటీ కారిడార్, కోకాపేట పరిసరాల్లో ప్రభుత్వ భూములు, చెరువులను కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియాపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపింది. మార్కెట్‌లో ఎకరం రూ.150 కోట్లకు పైగా పలికే ఈ ప్రాంతాల్లో బడా రియల్టర్లు పక్కా ప్రణాళికతో సాగిస్తున్న భూదందాకు అడ్డుకట్ట వేసింది. నిన్న నగరం నలువైపులా ఏకకాలంలో భారీ ఆపరేషన్ నిర్వహించి, సుమారు రూ.4,117 కోట్ల విలువైన ప్రభుత్వ, చెరువు శిఖం భూములను స్వాధీనం చేసుకుంది. ఆక్రమణలను తొలగించి, ఆ భూముల చుట్టూ రక్షణ కంచెలను ఏర్పాటు చేసింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా కోకాపేటలో ప్రముఖ స్థిరాస్తి సంస్థలు సాగిస్తున్న అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తచెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోని 1.09 ఎకరాల భూమిని ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఆక్రమించుకుంది. 'గోల్డ్‌ఫిష్ కాలనీ' పేరుతో అక్కడ విల్లాలను నిర్మించడమే కాకుండా మిగిలిన చెరువు భాగాన్ని మట్టితో పూడ్చివేసి నివాసితుల కోసం లగ్జరీ గార్డెన్లు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు నిర్మించింది. స్థానికులు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన హైడ్రా అధికారులు, అది చెరువు భూమి అని నిర్ధారించుకుని అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఇదే ప్రాంతంలోని పెద్దచెరువు పరిధిలో బహుళ అంతస్తుల భవనాల కోసం ఆక్రమించిన సుమారు 22 ఎకరాల స్థలాన్ని కూడా అధికారులు కాపాడారు. ఒక్క కోకాపేటలోనే స్వాధీనం చేసుకున్న భూముల విలువ రూ.3,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. మరోవైపు శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లోని ఈదులకుంట చెరువును ఏకంగా మ్యాప్ నుంచే తొలగించేందుకు జరిగిన భారీ కుట్రను హైడ్రా భగ్నం చేసింది. తమ్మిడికుంట చెరువు నిండినప్పుడు వచ్చే వరద నీటి కాలువను కబ్జాదారులు దారి మళ్లించి, చెరువు ఎండిపోయేలా చేశారు. ఆ తర్వాత ఆ స్థలంలో భారీ ఆకాశహర్మ్యాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు కూడా విచారణలో ఉంది. హైడ్రా అధికారులు శాటిలైట్ చిత్రాలు, పాత ఎఫ్‌టీఎల్ రికార్డుల ఆధారంగా 6.50 ఎకరాల చెరువు స్థలాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ రూ.600 కోట్లు. దీనికి ఆనుకుని ఉన్న రూ.500 కోట్ల విలువైన 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా అధికారులు కాపాడారు. భరత్‌నగర్-హఫీజ్‌పేట్ మార్గంలోనూ మరో కబ్జా వెలుగు చూసింది. రోడ్డు విస్తరణ కోసం జీహెచ్ఎంసీ భూసేకరణ చేసి, పరిహారం చెల్లించినప్పటికీ.. ఓ భూయజమాని 1700 గజాల స్థలాన్ని అప్పగించకుండా దానిపై కార్యాలయం, గోశాల నిర్మించాడు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో ఫిర్యాదులు అందాయి. స్పందించిన హైడ్రా అధికారులు ఆ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి రూ.17 కోట్ల విలువైన స్థలాన్ని రోడ్డు విస్తరణకు అప్పగించారు. ఈ మెగా ఆపరేషన్‌తో భూకబ్జాదారులకు ప్రభుత్వం స్పష్టమైన హెచ్చరికలు పంపినట్లయింది.

## ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలకు ప్రధాని మోదీ కీలక సూచనలు

తీవ్రమైన వేడి పరిస్థితుల్లో పలు జాగ్రత్తలు సూచించారు. నిత్యం తగినంత నీరు తాగాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదిక ద్వారా ఆయన ప్రజలకు జాగ్రత్తలు చెప్పారు. వీలైనంత వరకు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లవద్దని సూచించారు. అతి తీవ్రమైన వేడి నుంచి ప్రజలు తమను తాము కాపాడుకోవాలని అన్నారు. వృద్ధులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఇతరులకు సహాయం చేయాలని, ఇళ్లు, దుకాణాల వద్ద ఆరుబయట పక్షులు, జంతువుల కోసం నీటిని ఉంచాలని కోరారు. ఎండ కారణంగా ఎవరికైనా ఏమైనా అయితే ఏం జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు చేశారు. తల తిరగడం, వికారం, అలసట వంటి వడదెబ్బ లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. చుట్టూ ఉన్నవారిలో ఎవరైనా అకస్మాత్తుగా స్పృహ కోల్పోయినట్లు అనిపించినా, నీరసించినా వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలని అన్నారు. ఇలాంటి సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడుతామని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం పిల్లలు, వృద్ధులు, రైతులు, కార్మికులపై ఎక్కువగా ఉంటోందని అన్నారు. రాబోయే రోజుల్లో ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, బీహార్, ఒడిశా, తెలంగాణ, కోస్తా, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తున్నాయి. మే 29 నుంచి ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే కురిసే అవకాశం ఉందని తెలిపింది.

### 8వ పే కమిషన్: వేతన సవరణలో

## సరికొత్త ఫార్ములా..

### ఉద్యోగుల జీతాలు 400 శాతం పెంచే ప్రతిపాదన

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కోసం ఏర్పాటు చేసిన 8వ పే కమిషన్ కార్యకలాపాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కేవలం జీతాలు, పెన్షన్ల పెంపునకు పరిమితం కాకుండా, ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం ఎంతవరకు నెరవేర్చగలదనే ఆర్థిక చర్చకు ఇది దారితీసింది. ముఖ్యంగా, సీనియర్ ఉద్యోగుల జీతాలను ఏకంగా 400 శాతానికి పైగా పెంచే ఏకంగా 400 శాతానికి పైగా పెంచే ఒక ప్రతిపాదన అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

రైల్వే సంఘం సంచలన ప్రతిపాదన

8వ పే కమిషన్‌తో జరుగుతున్న సంప్రదింపుల ప్రక్రియలో, ఇండియన్ రైల్వే టెక్నికల్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ (×=ూూా) ఈ సంచలన ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. గత పే కమిషన్‌ల మాదిరిగా అందరికీ ఒకే ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ కాకుండా, ఉద్యోగుల పే లెవెల్స్ ఆధారంగా ఐదు వేర్వేరు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్లను అమలు చేయాలని కోరింది. ఇది గత సంప్రదాయాలకు పూర్తి భిన్నమైనది.

**ఐఆర్‌టీఎస్‌ఏ ప్రతిపాదన ప్రకారం:**

**లెవెల్ 1 నుంచి 5 వరకు: 2.92 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్**

**లెవెల్ 6 నుంచి 8 వరకు: 3.50 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్**

**లెవెల్ 9 నుంచి 12 వరకు: 3.80 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్**

**లెవెల్ 13 నుంచి 16 వరకు: 4.09 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్**

**లెవెల్ 17 నుంచి 18 వరకు: 4.38 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్**

ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదిస్తే, జీతాల్లో భారీ పెరుగుదల ఉంటుంది. ఉదాహరణకు లెవెల్ 17-18లో రూ.2.5 లక్షల బేసిక్ పే ఉన్న ఉద్యోగి జీతం, 4.38 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌తో దాదాపు రూ.10.95 లక్షలకు చేరుతుంది. అలాగే, మధ్యస్థాయి ఉద్యోగి రూ.45,000 బేసిక్ పే, 3.50 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌తో రూ.1.57 లక్షలకు పెరుగుతుంది. ప్రస్తుత వేతన విధానంలో జూనియర్, సీనియర్ ఉద్యోగుల మధ్య జీతాల వ్యత్యాసం తగ్గిపోయిందని, ముఖ్యంగా భద్రతాపరమైన విధుల్లో ఉన్న సాంకేతిక సిబ్బందికి అన్యాయం జరుగుతోందని ఐఆర్‌టీఎస్‌ఏ వాదిస్తోంది.

ఏమిటీ ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్?

పే కమిషన్ సిఫార్సులలో అత్యంత కీలకమైనది ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్. ఇది కేవలం జీతాలను సవరించడానికి ఉపయోగించే ఒక గుణకం (ఎబశ్రీఅజూశ్రీఅవతీ). ప్రస్తుత బేసిక్ పేను ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌తో గుణిస్తే కొత్త బేసిక్ పే వస్తుంది. 7వ పే కమిషన్‌లో ఈ ఫ్యాక్టర్‌ను 2.57గా నిర్ణయించారు. అయితే, ఈసారి ఉద్యోగ సంఘాలు చాలా ఎక్కువ డిమాండ్ చేస్తున్నాయి.

ప్రభుత్వం ముందున్న ఆర్థిక సవాళ్లు

ఉద్యోగ సంఘాల డిమాండ్లు భారీగా ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడం ప్రభుత్వానికి పెను సవాలుగా మారింది. అధిక ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ కేవలం జీతాలనే కాకుండా పెన్షన్లు, ఇతర అలవెన్సులు, బకాయిలు, దీర్ఘకాలిక పదవీ విరమణ బాధ్యతలను కూడా పెంచుతుంది. కేంద్రం జీతాలు పెంచితే, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే బాటలో పయనిస్తాయి. ఇది దేశవ్యాప్తంగా ఆర్థిక భారాన్ని మరింత పెంచుతుంది. ద్రవ్యోల్బణం, పెరిగిపోతున్న పెన్షన్ల భారం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మధ్యే మార్గాన్ని ఎంచుకోవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

ఇతర కీలక డిమాండ్లు

జీతాల పెంపుతో పాటు, 'ఫ్యామిలీ యూనిట్' ఫార్ములాను 3 నుంచి 5కి పెంచాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఆధునిక కుటుంబాల్లో పిల్లలు, వృద్ధ తల్లిదండ్రుల బాధ్యతలతో పాటు విద్య, వైద్య, గృహ ఖర్చులు పెరిగాయని వారు వాదిస్తున్నారు. మరోవైపు, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ డిమాండ్ కూడా బలంగా వినిపిస్తోంది. అయితే, ఎన్‌పీఎస్ ను పూర్తిగా రద్దు చేయడం ఆచరణ సాధ్యం కాకపోవచ్చని కొందరు అంగీకరిస్తూ, కనీస హామీ పెన్షన్ వంటి ఓపీఎస్ తరహా రక్షణలు కల్పించాలని కోరుతున్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలోని 8వ పే కమిషన్, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉద్యోగ, పెన్షనర్ సంఘాలతో విస్తృత సంప్రదింపులు జరుపుతోంది. జూలై 6, 7 తేదీల్లో భువనేశ్వర్‌లో, ఆ తర్వాత లక్నో, హైదరాబాద్, శ్రీనగర్ వంటి నగరాల్లో సమావేశాలు జరపనుంది. ఈ కమిషన్ సిఫార్సులు దాదాపు 1.1 కోట్ల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగుల భారీ అంచనాలు, ప్రభుత్వ ఆర్థిక వాస్తవాల మధ్య కమిషన్ ఎలాంటి సమతుల్యత సాధిస్తుందో వేచి చూడాలి.

## ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా టీమ్ 11 కి బ్యాటింగ్ తప్పదు: మహానాడులో నారా లోకేశ్

అమరావతి: మహానాడు ప్రారంభం సందర్భంగా టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ ప్రత్యర్థి పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. హైబ్రిడ్ విధానంలో మహానాడు జరుగుతున్నప్పటికీ టీమ్ -11 కి బ్యాటింగ్ తప్పదని వార్నింగ్ ఇచ్చారు. "ఆఫ్‌లైన్ అయినా, ఆన్‌లైన్ అయినా, హైబ్రిడ్ అయినా మహానాడు మాస్ జాతర సూపర్ హిట్. పసుపు పండుగ మహానాడు. ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసి నేను తెలుగు వాడిని, నాది తెలుగుదేశం పార్టీ అని చెప్పుకునే వేదిక మహానాడు. నేషన్ ఫస్ట్ అనేది తెలుగుదేశం పార్టీ విధానం. మన దేశం - మన బాధ్యత. ప్రధాని మోదీ సూచించిన మార్గాన్ని మనం ఫాలో అవుతున్నాం. నెల్లూరులో భారీగా మహానాడు నిర్వహించాలనుకున్నాం. ప్రత్యేక పరిస్థితుల్లో హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తున్నాం. మనం హైబ్రిడ్ మోడల్ అనగానే టీమ్ 11 సంబరాలు చేసుకున్నారంట. ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా టీమ్ 11 కి బ్యాటింగ్ తప్పదు" అని స్పష్టం చేశారు.

లెజెండ్... అన్న ఎన్టీఆర్!

విశ్వవిఖ్యాత నట సార్వభౌమ శ్రీ నందమూరి తారక రామారావు గారు దేశానికి లెజెండ్. తెలుగువారి ఆత్మ గౌరవం, తెలుగు వారి పౌరుషం ఎన్టీఆర్. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ ఆయన ట్రెండ్ ఫాలో అవ్వలేదు.. ట్రెండ్ సెట్ చేశారు. ఆయన రికార్డులు బద్దలు కొట్టడం ఎవరివల్లా సాధ్యం కాదు. దేశానికి సంక్షేమం, అభివృద్ధి పరిచయం చేసింది ఎన్టీఆర్. 2 రూపాయలకు కిలో బియ్యం, పెన్షన్, జనతా వస్త్రాలు, పక్కా ఇళ్లు, గురుకుల పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం, పటేల్-పట్వారీ విధానం రద్దు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు వంటివి ప్రవేశపెట్టింది ఎన్టీఆర్. స్త్రీశక్తిని మొదట గుర్తించింది, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఇచ్చింది, మహిళల కోసం ప్రత్యేకంగా పద్మావతి యూనివర్సిటీ పెట్టింది, మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇచ్చింది అన్న ఎన్టీఆర్... అని లోకేశ్ ప్రశంసించారు.

## "గొడ్డలి పార్టీ అంటే సైకోకి కోపం వచ్చింది అంట

అమరావతి: తెలుగుదేశం పార్టీ పండుగలా జరుపుకునే మహానాడు వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో హైబ్రిడ్ మోడల్ లో వేడుకలు కొనసాగుతున్నాయి. వేడుకల సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబుపై ప్రశంసల జల్లు కురిపించారు. విజనరీ లీడర్ సీబీఎన్ అని కొనియాడారు. "ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మూడు అక్షరాలు చెబితే గౌరవం దక్కుతుంది. ఆ మూడు అక్షరాల బ్రాండ్ సీబీఎన్. ఈ సౌండ్ తాడేపల్లి ప్యాలస్‌కు వినపడాలి.. టీమ్ 11 టీవీలో మహానాడు చూస్తుంది. ఒక్కరితో అయితే పోటీ పడగలం. కానీ ఆయనలో 25 ఏళ్ళ కుర్రాళ్లు ముగ్గురు ఉన్నారు. ఆయన జెట్ స్పీడ్‌లో వెళు తుంటారు. ఆయన స్పీడ్ అందుకోవడానికి మనం కష్టపడుతున్నాం. అప్పుడు కియా... ఇప్పుడు ఫైటర్ జెట్స్. అప్పుడు ఐటీ.. ఇప్పుడు ఏఐ. అప్పుడు హైటెక్ సిటీ.. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ. అప్పుడు సైబరాబాద్... ఇప్పుడు అమరావతి. భవిష్యత్తును ముందుగానే చూసే విజనరీ మన లీడర్ సీబీఎన్. స్త్రీశక్తిని మహా శక్తిగా మార్చింది, మహిళలకు విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది, డ్వాక్రా ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చింది, తన తల్లి పడిన కష్టం మరే తల్లి పడకూడదని దీపం పథకం ప్రవేశపెట్టింది, మహిళలను బస్ కండక్టర్స్ చేసింది మన సీబీఎన్. దేశంలోనే మొదటి మహిళా స్పీకర్‌గా ప్రతిభా భారతిని నియమించింది మన సీబీఎన్. ఎవరైనా మహిళల జోలికి వస్తే అదే వారికి లాస్ట్ డేట్ అని చెప్పిన దమ్మున్న నాయకుడు మన సీబీఎన్" అని లోకేశ్ ఉద్ఘాటించారు. తెలుగుదేశంలో కార్యకర్తే అధినేత అని లోకేశ్ అన్నారు.. 2019 నుంచి 2024 వరకు పసుపు సైన్యం చేసిన పోరాటం ఒక చరిత్ర. మనం కొట్టిన దెబ్బకి వై నాట్ 175 కాస్తా టీమ్ 11 అయిందని ఎద్దేవా చేశారు. ఒకే రాష్ట్రం -- ఒకే రాజధాని -- అభివృద్ధి వికేంద్రీకరణ మన విధానమని చెప్పారు. దేశవ్యాప్తంగా వచ్చే పెట్టుబడుల్లో ఈరోజు 25 శాతం ఆంధ్రప్రదేశ్ కు వస్తున్నాయని తెలిపారు. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, ఫైటర్ జెట్ ప్రాజెక్టులు ఏపీకి క్యూకడుతున్నాయని చెప్పారు.

"గొడ్డలి పార్టీ అంటే సైకోకి కోపం వచ్చింది అంట. మాది గూగుల్ -- మీది గొడ్డలి. మాది ఫైటర్ జెట్స్ -- మీది ఫ్యాక్షన్. మాది కియా -- మీది కిడ్నాప్. బాబాయిని చంపింది గొడ్డలితో కాదా? తల్లిని ఇంటి నుండి బయటకు గెంటింది నిజం కాదా? చెల్లికి అన్యాయం చేసి ఆస్తులు కొట్టేసింది నిజం కాదా? అందుకే గొడ్డలి పార్టీ అంటున్నాం" అని చెప్పారు. "నిజం గడప దాటే లోగాని అబద్ధం ప్రపంచం చుట్టి వస్తుంది. బాబాయిని చంపి కత్తి బాబుగారి చేతిలో పెట్టారు. వైసీపీ ఫేక్ ప్రాపగాండాను గట్టిగా తిప్పికొట్టాలి. ఇప్పుడు రోజుకో కుట్రతో వస్తున్నారు. సైకో... నీది టెన్త్ క్లాస్ పేపర్ కొట్టేసిన హిస్టరీ ... నాది స్టాన్‌ఫోర్డ్ హిస్టరీ. టీచర్లను లిక్కర్ షాప్ ముందు నిలబెట్టిన హిస్టరీ నీది... టీచర్లను ట్రైనింగ్ కోసం సింగపూర్ పంపిన హిస్టరీ నాది. 5 సంవత్సరాల్లో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయని హిస్టరీ నీది ...

16,347 టీచర్ పోస్టులు ఒక్కసారిగా భర్తీ చేసిన హిస్టరీ నాది. జాబ్ క్యాలెండర్ అని సాక్షి క్యాలెండర్ చేతిలో పెట్టిన హిస్టరీ నీది ... 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన హిస్టరీ నాది" అని జగన్ ను ఉద్దేశించి లోకేశ్ ఎద్దేవా చేశారు. ఇక నుంచి మనం గేర్ మార్చాలని, మిషన్ మోడ్‌లో పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి ఎన్నికలోనూ మనమే గెలవాలి, అదే మన గోల్ అని చెప్పారు. "ప్రజల్లోకి వెళదాం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయి. అహంకారం వద్దు. అహంకారం చూపిన వారికి 151 కాస్తా 11 అవడం చూశాం. ప్రజలకు సేవ చేయడం మన ధ్యేయం. మనం అనుకున్నది సాధించాలంటే ప్రభుత్వ కొనసాగింపు ముఖ్యం. ఒకే ప్రభుత్వం ఉండటం వల్లే గుజరాత్, ఒడిశా రాష్ట్రాలు అభివృద్ధి సాధించాయి. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ మన బలం. మనకు నమో ఉన్నారు. నమో అంటే నాయుడు-మోదీ. వీరిద్దరితో కలిసి పవనన్న కాంబోతో పోలవరం, విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు, అమరావతి, కర్నూల్ హైకోర్టు బెంచ్ సాధించాం" అని లోకేష్ పేర్కొన్నారు.

## గొడ్డలి పార్టీకి, టీడీపీకి పోలికే లేదు వారిది విధ్వంసమైతే మనది అభివృద్ధి

మొదటి పేజి తరువాయి

గత ప్రభుత్వ వైఫల్యాలు.. ప్రస్తుత ప్రభుత్వ చర్యలు

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనక్కి వెళ్లిపోయిందని చంద్రబాబు ఆరోపించారు. "విశాఖలో రైల్వే జోన్ కోసం కనీసం 52 ఎకరాల భూమిని కూడా ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం వారిది. కూటమి అధికారంలోకి వచ్చాకే రైల్వే జోన్‌ను సాధించుకున్నాం" అని తెలిపారు. గత పాలకులు రూ.32 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపారని, డిస్కమ్‌లను రూ.1.35 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలు పెంచబోమని మాటిచ్చామని, ఇప్పుడు కూడా అదే మాట మీద ఉన్నామని, తొలిసారిగా విద్యుత్ ఛార్జీలకు సంబంధించి ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. గుంతలు పడ్డ రోడ్లను బాగుచేయడంతో పాటు, 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించామని వివరించారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు..

భూ వివాదాలకు కారణమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామని, రికార్డులు ట్యాంపర్ కాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకున్నామని చంద్రబాబు వెల్లడించారు. నాలా యాక్టును కూడా రద్దు చేసి, ఇప్పుడు రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఏర్పడిన ఇంధన కొరత, ఆక్వా రంగ సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు హామీ ఇచ్చారు.

### కేడర్‌కు భరోసా.. భవిష్యత్ కార్యాచరణ

దేశంలో ఏ పార్టీకి లేని బలమైన కేడర్ టీడీపీకి ఉందని, పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని చంద్రబాబు కొనియాడారు. తెలుగుదేశం పార్టీ నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం లాంటిదని, ఇక్కడ శిక్షణ పొందిన వారే అన్నిచోట్లా రాణిస్తున్నారని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం ఇప్పటికే రూ.160 కోట్లు ఖర్చు చేశామని, "మై హెల్త్ యాప్" ద్వారా వారి ఆరోగ్య బాధ్యతను కూడా పార్టీ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

### స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఏ ఎన్నికైనా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, నేతలు ఇగోలకు పోకుండా మిత్రపక్షాలతో సమన్వయంతో ముందుకు సాగాలని హితవు పలికారు. "ఆరోగ్యకర, సంపన్న, సంతోష ఏపీ" (హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ) నిర్మాణమే తమ లక్ష్యమని, మహానాడు సాక్షిగా తెలుగు జాతి కోసం పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు. 2024 ఎన్నికల విజయాన్ని మళ్లీ పునరావృతం చేసేలా అందరూ కలిసి పనిచేయాలని కోరారు.

# అధికార పార్టీ పేరుతో బరితెగించిన భూ కబ్జాదారులు

**- ఆనాడు అజయ్, నేడు మంత్రి తుమ్మల వర్గం అంటూ..**

**- ఖమ్మం లో చిరు లీలలు అన్ని ఇన్ని కావు మరి**



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో మరోసారి భూకబ్జా భూకంపం సంభవించింది. ఆనాడు బిఆర్ ఎస్, నేడు కాంగ్రెస్ పార్టీ అధికార పార్టీ పేరుతో భూకబ్జా దారులు ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా అక్రమించి యదేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుస్తునారనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. అధికార పార్టీ ముసుగులో భూకబ్జా చేస్తున్న కనీసం అటువైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి అధికారులది. అంతా మేక వన్నె పులి స్టలే అనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఆనాడు అజయ్ కుమార్, నేడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులం అంటూ కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని నిర్మాణం పేరుతో ఆక్రమించి దర్జాగా అనుభవిస్తున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వస్తోంది. ఖమ్మం నగరంలో ఒక చోట కాదు పదుల సంఖ్యలో చిరు లీలలు అన్ని ఇన్ని కావు మరి అనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. దీని వెనుక పెద్ద కథే ఉంది మరి. వివరాల్లోకి వెళితే... ముఖంలో చిరునవ్వు పలకరింపులో ఆప్యాయత, అందరి వాడిలా బిల్డప్ సీన్ కట్ చేస్తే మేక వన్నె పులి స్టలో ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు స్కెచ్ వేస్తే అంటే ఖతం కాక తప్పదు. ఒక్క ప్రభుత్వ స్థలలే కాదు అన్నింటా సిద్ధహస్తుడే. చిరు లీలలు అన్నీ ఇన్ని కావు, వార్డులో జరిగే ప్రతి పంచాయతీ అది భార్యాభర్తల మొదలు, అన్నదమ్ములు, తండ్రి కొడుకులు ఇలా ప్రతి దాంట్లో వేలు పెట్టి వాసన చూసి జేబు నింపుకోవడం పరిపాటిగా మార్చుకున్నాడు. అసలు కార్పొరేషన్ లోని టౌన్ ప్లానింగ్ అధికారులతో మనోడి లైజనింగ్ మామూలుగా ఉండదు. కాసుల కోసం కండువాలు మార్చే ఊసరవెల్లి ఇతగాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో తోటి కార్పొరేటర్లు ఇతగాడి అక్రమ క్రమబద్దీకరణ పై విచారణ జరిపించాలని సాక్షాత్తు కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం



విశేషం. పదవీకాలం దగ్గర పడుతున్న క్రమంలో చిన్నగా పెద్దాయన పంచన చేరి ఫిర్యాదు పై విచారణ లేకుండా చేయించుకున్నాడు. ముఖ్యమంత్రి మా ఇంట్లో భోంచేశాడు నాకు డైరెక్ట్ అంటూ కాలనీలో హల్చల్ చేస్తుంటాడు. కాసుల కోసం వెంపర్లాడుతూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతూ మున్సిపల్ అనుమతులు లేకుండా వ్యాపార సముదాయాలు నిర్మించడం వాటిని అద్దెకు ఇవ్వటం. పైరవీలతో మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టేలా అనుమతులు లేకుండానే వ్యాపార సముదాయాల నిర్మాణానికి స్వీయ అనుమతులు ఇవ్వడం విశేషం. కొంతమంది మీడియా మిత్రులతో సన్నిహితంగా ఉంటూ తన అక్రమాలు కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తుంటాడు. గత ప్రభుత్వంలోని మంత్రి తనకు ఇష్టం లేకుండా బలవంతంగా కండువా మార్చాడని అప్పుడు ప్రస్తుత మంత్రి పార్టీలోకి రావాలని బలవంతం చేస్తేనే పార్టీ మారానని ఇప్పుడు సన్నిహితులతో కోతలు కోస్తుంటాడు. ఒకటా, రెండా అక్రమాలకు కేరాఫ్ గా మారిన తాజా మాజీ పై చర్యలు తీసుకోవాలని లేకుంటే ప్రభుత్వ స్థలం అనేది కనిపించకుండా పోతుందని స్వయంగా కాలనీవాసులు పెద్దాయనకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం గమనార్హం. ఊసరవెల్లి కూడా సిగ్గుపడేలా ప్రవర్తిస్తున్న ఇతగాడికి రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో టిక్కెట్టు ఇవ్వద్దంటూ వార్డు ముఖ్యులు పదుల సంఖ్యలో పార్టీ పెద్దలకు లేఖలు రాయడం విశేషం.

# "మహానాడు 2026 వేడుకలు"

**మాచర్ల నియోజకవర్గం శాసన సభ్యులు జూలకంటి బ్రాహ్మానంద రెడ్డి**



కారంపూడి: తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక అయిన మహానాడు ప్రాముఖ్యతను, దాని నిరంతర ఆవశ్యకతను వివరిస్తూ కారంపూడి శ్రీనివాసకళ్యాణ మండపంఒప్పిచర్ల మరియు వెంకటేశ్వ కళ్యాణ మండపంకారంపూడి లో జరుగుతున్న వేడుకల్లో మహానాడు వేడుకలు మాచర్ల యోజకవర్గ పరిశీలకుడు తాడిశెట్టి మురళీమోహన్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమర్థ సారథ్యం, మంత్రి నారా లోకేష్ యువ నాయకత్వం, మరియు రాష్ట్ర పార్టీ పర్యవేక్షణలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఈ మహానాడు వేడుకలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిణామాలకు అద్దం పట్టే మహానాడు ప్రధాన ఉద్దేశాన్ని, పార్టీ ప్రవేశపెడుతున్న కీలక రాజకీయ, ఆర్థిక, సంక్షేమ తీర్మానాల వివరాలను ఆయన శ్రేణులకు వివరించారు. సాంకేతికతను జోడిస్తూ పార్టీ శ్రేణులను మరింత అనుసంధానం చేసేందుకు రూపొందించిన "డిజిటల్ మహానాడు" ప్రత్యేకతలను తెలియజేస్తూ, ఈ పండుగ ను అందరు ఆచరించాలని కోరారు ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ... పార్టీకి అసలైన బలం, ఊపిరి కార్యకర్తలేనని



కొనియాడారు. కష్టకాలంలోనూ జెండాను గుండెలకు హత్తుకుని, పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమించిన ప్రతి కార్యకర్తకూ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని, రాబోయే రోజుల్లో వారి కష్టానికి తగిన గుర్తింపు, గౌరవం దక్కుతాయని స్పష్టం చేశారు. చారిత్రక తీర్మానాలతో, డిజిటల్ హంగులతో సాగుతున్న ఈ రెండు రోజుల మహానాడు పండుగలో ప్రతి ఒక్కరూ పసుపు కండువాలతో తరలివచ్చి భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు.

# ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఎన్ ఎస్ పి కాలువ స్థలం దర్జాగా కబ్జా

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నడి రోడ్డు లో ఉన్న మమతా రోడ్డు నుండి గొల్లగూడెం



కు పోయే రోడ్డుకి ఎడమవైపు ఉన్న స్థలం కార్పొరేషన్ పరిధిలో గల 11 వ డివిజన్ లో ఎన్ ఎస్ పి కాలువ స్థలం సుమారు 200 గజాలు ఆక్రమణకు గురవుతుంది. దర్జాగా పట్టపగలు కబ్జా చేస్తూ ఉన్న స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ సోదరుడు ఎటువంటి డాక్యుమెంట్స్ లేకున్నా ఐరన్ పోల్స్ తో నిర్మాణం చేస్తున్నారు. పాత ఎన్ఎస్పి కాలువ స్థలం గజం ధర 50 వేల రూపాయలు ఉంటుంది సుమారు కోటి రూపాయలు విలువ గల భూమిని దర్జాగా కబ్జా చేస్తూ ఉన్న ఆ కార్పొరేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకుండా ఉండటాన్ని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదలు,సామాన్యులు గుడిసెలు వేసుకుంటే కూల్చివేత హైడ్రా పేరుతో హడావుడి చేసే అధికారులు ఇప్పుడు ఎటుపోయారు అని స్థానికులు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ కార్యాలయాలకు, అంగన్వాడి స్కూలుకు ప్రధమ చికిత్స కేంద్రానికి చక్కగా పనికొస్తుంది అని ఆ ప్రాంత వాసులు తెలిపారు. అలాంటి లక్షల రూపాయలు స్థలాన్ని వారు కబ్జా చేస్తుంటే అడిగే నాధుడే లేకుండా పోయింది . ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు కళ్ళు తెరిచి చూడండి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా లక్షల రూపాయల ప్రజాధనాన్ని వృధాగా పోనీయకుండా చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

# ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు జులై 3,4,5 తేదీలకు వాయిదా

**- మే 28,29,30 తేదీల్లో కేంద్ర మోసపూరిత మద్దతు ధరలపై గ్రామ గ్రామాన నిరసనలు.జూన్ 1న వర్జీనియా పొగాకు రైతుల చలో గుంటూరు**

**- అమెరికా, ఇండియా వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగానికి గొడ్డలి పెట్టు**

**- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య విమర్శ**



ఏలూరు, నేటి శుభోదయ ::: జూన్ 3,4,5 తేదీలలో ఏలూరులో జరప తలపెట్టిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలను ఎండలు తీవ్రత దృష్ట్యా జులై 3,4,5 తేదీలకు మార్పు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య ప్రకటించారు. రైతు సంఘం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. బుధవారం ఏలూరు, పవరుపేటలోని అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు తేదీల మార్పును అందరూ గమనించాలని విజ్ఞప్తి చేశారు. జులై 3, 4,5 తేదీలలో ఏలూరులోని డీసీఎంఎస్ ఫంక్షన్ హాలులో ఈ మహాసభలు జరుగుతాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఎంపిక చేసిన 500 మంది రైతు ప్రతినిధులు మూడు రోజులు పాటు జరిగే మహాసభల్లో పాల్గొంటారని,3వ తేదీన రైతాంగ,ప్రజా ప్రదర్శన బహిరంగ సభ జరుగుతాయని, అఖిల భారత కిసాన్ సభ జాతీయ నాయకులు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొంటారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మోసపూరిత మద్దతు ధరలపై ఈనెల 28,29,30 తేదీల్లో గ్రామాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర విడుదల చేసిన మద్దతు ధరల ఆదేశాల కాపీలను దగ్ధం చేసి ఆందోళనలు చేపట్టాలన్నారు. ఎరువులు,పెట్రోల్, డీజిల్ ధరలు దారుణంగా పెంచివేశారని, 20 శాతం సాగు ఖర్చులు పెంచి మద్దతు ధరలు మాత్రం ఒక శాతం నుండి 8 శాతం వరకే పెంచారని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. వర్జీనియా పొగాకు గిట్టుబాటు ధర రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు కొనుగోలు కంపెనీలు సిండికేట్ గా మారి పొగాకు రైతులను నిలువుగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. వర్జీనియా పొగాకు రైతుల సమస్యలపై జూన్ 1వ తేదీన గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్నామని,ఛలో గుంటూరు కార్యక్రమంలో పొగాకు రైతులు ఏలూరు జిల్లా నుండి పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అమెరికాతో భారత చేసుకున్న వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగానికి గొడ్డలి పెట్టు అని కృష్ణయ్య విమర్శించారు. ఈ వాణిజ్య ఒప్పందం వలన వ్యవసాయరంగం మరింత తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా 5 లక్షల కోట్ల రూపాయల దేశ సంపదను అమెరికా కొల్లగొట్టుకుని పోయేందుకే ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. దేశ రైతాంగం, ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టేలా కేంద్రం చేసుకుంటున్న ఒప్పందాన్ని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

**--ఆక్వా రంగాన్ని కాపాడాలి**

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షోభంలో కూరుకుపోతున్న ఆక్వారంగాన్ని కాపాడాలని కోరారు. రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ. 1.5 విద్యుత్ సబ్సిడీ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఆక్వా రైతులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, కోన శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, సున్నా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి మహానాడు ఉత్సవాలు




పుట్టపర్తి, నేటి శుభోదయ :: శ్రీ సత్యసాయి జిల్లా, పుట్టపర్తి నియోజకవర్గం వ్యాప్తంగా 11 క్లస్టర్లలో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు . రాష్ట్రవ్యాప్తంగా హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్న మహానాడు వేడుకల్లో భాగంగా పుట్టపర్తి నియోజకవర్గంలో పసుపు సందడి నెలకొంది. పుట్టపర్తిలోని సాయి ఆరామం గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ పార్వతమ్మతో కలిసి స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వర్చువల్ ద్వారా జరిగిన మహానాడు కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని వీక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నియోజకవర్గం అంతా పసుపుమయంగా మారి టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పక్షపాతి ఎన్టీఆర్ అని కొనియాడారు. సంక్షేమ పథకాల ఆవిర్భావానికి ఎన్టీఆర్ ఆద్యుడని, పేద ప్రజల హృదయాలను గెలుచుకున్న మహానేత అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని తెలిపారు. టిడిపికి అసలైన బలం కార్యకర్తలేనని, తరాలు మారినా పసుపు జెండా మారదని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల రుణం ఎన్నటికీ



తీర్చలేమని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా కార్యకర్తల వెంటే నిలబడే నాయకుడు చంద్రబాబు నాయుడేనని అన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఏపీ అభివృద్ధికి దిక్సూచి చంద్రబాబు నాయుడేనని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. నవ్యాంధ్ర సృష్టికర్త చంద్రబాబేనని, కార్యకర్తల త్యాగాల వల్లే పార్టీ, ప్రభుత్వాల్లో పదవులు దక్కుతున్నాయని పేర్కొన్నారు.భవిష్యత్తులో టీడీపీ కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా కుటుంబ సభ్యుల్లా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నాయకత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. 2029 నాటికి నియోజకవర్గంలోని 193 చెరువులను హంద్రీనీవా జలాలతో నింపి సస్యశ్యామలం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు.పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి గేమ్ ఛేంజర్‌గా నిలుస్తున్నారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన 11 క్లస్టర్లలో ఏర్పాటుచేసిన వర్చువల్ మహానాడు పండుగ కార్యక్రమంలో టిడిపి ప్రజాప్రతినిధులు ,టీడీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు ,టిడిపి మహిళలు, టీడీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# యాడికిలో ఘనంగా బడిబాట

**ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల పెంపునకు ప్రత్యేక డ్రైవ్**



యాడికి మే 27 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుదలపై ప్రత్యేక అవగాహన డ్రైవ్ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వీరరాజు, మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) ఎం. కాశప్ప, ఎంఈవో-2 సీతా రామాంజనేయులు, ఉపాధ్యాయులు మరియు సీఆర్ఎంటీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, విద్యా ప్రమాణాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అర్హులైన పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు...



# ప్రపంచానికి చాటి చెప్పే మహోత్సవమే మహానాడు



పెనమలూరు, మే 27 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భూర్ల రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్చువల్ మహానాడు సమావేశాల్లో పత్తిపాడు నియోజకవర్గ పరిశీలకులు రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్ 12 క్లస్టర్లలో పాల్గొని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపుతు కస్టర్ వైజుగా బజరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచినీళ్లు భోజన సదుపాయం టి స్నాక్స్ అందజేయడం ఏసీ కూలర్స్ ఏర్పాటు చేయడం ఎలాంటి అసౌకర్యం కలక్కుండా తెలుగుదేశం కుటుంబ సభ్యులు తెలుగు ప్రజల పండగ వాతావరణం లోపసుపు సైనికుల పండుగ.తెలుగు జాతి కీర్తినస్ సాధించిన ప్రగతిని అందుకున్న విజయాలను ప్రపంచాన్ని చాటి చెప్పే మహోత్సవమే .."మహానాడు"అధినేత ఆదేశాలతోక్లస్టర్ వైట్ గా జరుగుతున్నటువంటి మహానాడు కార్యక్రమంలో పాల్గొన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారుమహానాడు కార్యక్రమాల ద్వారా క్లస్టర్ స్థాయిలో పార్టీ మరింత పటిష్టంగా ఎదగాలని, భవిష్యత్‌బ నాయకుడు మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ దిశానిర్దేశాలను సమర్థవంతంగా అమలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకత్వంపై అభినందనలు వ్యక్తం చేశారు కార్యకర్తే అధినేత కార్యకర్త పార్టీకి అసలైన బలం అనే భావనతో, మహానాడు కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న మండల పార్టీ అధ్యక్షులు క్లస్టర్ ఇంచార్జ్, యూనిట్ ఇన్చార్జిలు పోలింగ్ బూత్ కన్వీనర్లు కే ఎస్ ఎస్ ముఖ్య నాయలకు, కార్యకర్తలకు శొంఠి శివరామా ప్రసాద్ గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి మరింత బలంగా చేరేలా ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని అన్నారు.

# దేవీపట్నం మండలంలో ఘనంగా 'మహానాడు' వేడుకలు

**ఇందుకూరుపేట టీడీపీ కార్యాలయంలో హైబ్రిడ్ విధానంలో నిర్వహణ**


**ఎన్టీఆర్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన పార్టీ శ్రేణులు**



దేవీపట్నం నేటిశుభోదయ మే 27: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి సూచనలతో దేవీపట్నం మండలం ఇందుకూరుపేట స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహానాడు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి . సరికొత్త సాంకేతికతను జోడించి, సరిహద్దులు లేని అనుసంధానంతో మొదటిరోజు కార్యక్రమాన్ని 'హైబ్రిడ్ విధానం'లో నిర్వహించడం విశేషం.క్లస్టర్ ఇంచార్జ్ ముచ్చు వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో, మండల పార్టీ అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు పర్యవేక్షణలో ఈ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. మహానాడు ఉత్సవాల సందర్భంగా పార్టీ శ్రేణులు ముందుగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి, జై తెలుగుదేశం.. జై ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు.అనంతరం, తెలుగుజాతి గర్వకారణం, టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.?సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఏర్పాటు చేసిన ఈ హైబ్రిడ్ మహానాడులో భాగంగా.. ప్రధాన వేదికపై జరుగుతున్న కార్యక్రమాలను స్థానిక నాయకులు, కార్యకర్తలు, టిడిపి అభిమానులు కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించారు. పార్టీ అధినాయకత్వం దిశానిర్దేశాన్ని శ్రద్ధగా వింటూ, డిజిటల్ విధానంలో అనుసంధానమై ఈ మహానాడు కార్యక్రమంలో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు సొసైటీ అధ్యక్షులు మాగపు బాబురావు, సొసైటీ



అధ్యక్షులు కొండారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ముంద్రు మధుసూదన్ రావు, మాజీ మండల అధ్యక్షులు తైలం గంగాధర్,మాజీ మండల అధ్యక్షులు మరిశెట్ల వెంకటేశ్వరావు, నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు రేలంగి రాంబాబు మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# ‘గోదావరి పవిత్రత దెబ్బతింటే ఊరుకోం... డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలు శిరోధార్యం..!’

**– మంత్రి దుర్గేష్.. – గోదావరి కాలుష్య నివారణే ధ్యేయం... పీసీబీ నోడల్ ఏజెన్సీగా ‘స్పెషల్ టాస్క్ ఫోర్స్’ ఏర్పాటు... జీవో జారీ చేసిన ప్రభుత్వం ! ‘ఆంధ్రా పేపర్ మిల్లు’ యాజమాన్యానికి ఘాటు హెచ్చరిక... రూ.13 కోట్ల మున్సిపాలిటీ బకాయిలపై మంత్రి దుర్గేష్ ఆగ్రహం.! – రూ. 8,500 కోట్లతో 2027 గోదావరి మహా పుష్కరాల భారీ ప్రణాళిక... శరవేగంగా సాగనున్న పనులు.! – ఈసారి గోదావరి పుష్కరాలు పూర్తిగా ‘ప్లాస్టిక్ రహితం’... కుంభమేళా తరహాలో పర్యాటక శాఖ తరపున టెంట్ సిటీలు, హోమ్ స్టేల ఏర్పాటు.!**




రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రెండు రోజుల రాజమహేంద్రవరం పర్యటన అత్యంత విజయవంతమైందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కందుల దుర్గేష్ వెల్లడించారు. బుధవారం రాజమహేంద్రవరంలోని హుకుంపేట కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం పర్యటనతో అధికార, స్థానిక యంత్రాంగం ఒక్కసారిగా అలెర్ట్ అవ్వడమే కాకుండా, అందరిలో ఒక సరికొత్త స్ఫూర్తి, జవాబుదారీతనం వచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే 2027 గోదావరి పుష్కరాలను ఎంత సమర్థవంతంగా నిర్వహించాలనే అంశంపై పూర్తి స్పష్టత, ఒక ఖచ్చితమైన రోడ్ మ్యాప్ సిద్ధమైందని, కాలుష్య రహితంగా పుష్కరాలను నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**- ట్రోలర్లకు ఘాటు సమాధానం**

**-- నాయకుడి అడుగుజాడల్లో నడుస్తాం..’**

ప్రజల ఆరోగ్యం, గోదావరి పవిత్రత విషయంలో కూటమి ప్రభుత్వానికి అత్యంత బాధ్యత ఉందని మంత్రి దుర్గేష్ అన్నారు.. ఆ బాధ్యతతోనే డిప్యూటీ సీఎం కొన్ని కీలక సూచనలు చేశారు. నాయకుడి ఆలోచనకు తగ్గట్టుగా, శాఖా మంత్రిగా ఆ సూచనలను క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత నాది. మా మధ్య ఉన్నది ప్రజా సంక్షేమ సంకల్పం మాత్రమే... రాజకీయ కాలుష్యం కాదు!” అని ట్రోలర్స్ కు మంత్రి కందుల దుర్గేష్ ఘాటుగా సమాధానమిచ్చారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ నాయకుడని, ఆయన సలహాలు, సూచనలను తానే కాకుండా స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర రాజకీయ నాయకత్వం సమర్థవంతంగా పాటిస్తామని, అది తమ బాధ్యతని అన్నారు.

**గోదావరి కాలుష్యంపై**

**‘స్పెషల్ టాస్క్ ఫోర్స్’ ఏర్పాటు..జీవో జారీ..**

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా నల్లాఛానల్ నుండి గోదావరిలోకి డిశ్చార్జ్ అవుతున్న నీరును, కలుషితం అవుతున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారని మంత్రి తెలిపారు. నిన్న ఆయన కాలుష్యాన్ని చూసి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారని, ఈ క్రమంలో గట్టిగా పని చేయాలని తన, పర బేధం లేకుండా అందులో భాగస్వామ్యులైన వారికి సూచిస్తూ తనకు ఆదేశాలు జారీ చేశారని, ఆ ఆదేశాలను శిరోధార్యంగా పాటిస్తామని చెప్పారు. ఈ క్రమంలో గోదావరి కాలుష్య నివారణకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (గ్రజదీ) ను నోడల్ ఏజెన్సీగా చేస్తూ, వివిధ శాఖల అధికారులతో కూడిన ‘స్పెషల్ టాస్క్ ఫోర్స్’ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ ఉదయమే ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే పేరుతో సంబంధిత జీవో కూడా విడుదలయిందని, కూటమి ప్రభుత్వంలో మాట లానే యాక్షన్ కూడా అంతే స్పీడ్ గా ఉంటుందని తెలిపారు. నదిని కలుషితం చేస్తున్న కారకాలను గుర్తించేందుకు త్వరలోనే సమగ్రమైన ‘పొల్యూషన్ ఆడిట్’ నిర్వహిస్తామని, ఇది నిరంతర ప్రక్రియగా ప్రతిసారి జరుగుతుందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

**- పరిశ్రమల యజమానులకు మాస్ వార్నింగ్...రూ.13 కోట్ల బకాయిలపై ఆగ్రహం..**

స్థానిక వనరులు, సంపదను వినియోగించుకొని ధనార్జన చేస్తున్న కంపెనీలకు మంత్రి దుర్గేష్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. “ప్రజా రక్షణ, పర్యావరణ ప్రమాణాలను ఉల్లంఘిస్తే ఎంతటి పరిశ్రమనైనా ఉపేక్షించేది లేదు. ముఖ్యంగా ‘ఆంధ్రా పేపర్ మిల్లు’ వ్యర్థాల తీవ్రతపై ఇప్పటికే పలుదఫాలు చర్చించాం. ఎఫ్ లెంట్ ట్రీట్ మెంట్ చేసే గోదావరిలోకి నీళ్లు వదులుతున్నామని మాకు దొంగమాటలు చెబుతున్నారు. నిన్న స్వయంగా డిప్యూటీ సీఎం, మేము కళ్లారా చూసి నీటి గాఢతను చెక్ చేస్తే పీహెచ్ విలువ 7 కంటే ఎక్కువగానే ఉంది. మీరెంత బాధ్యతారాహిత్యంగా ఉన్నారో నిన్నటి ఘటన చూస్తే స్పష్టమవుతోంది. ఓవైపు లాభాలు పొందుతూ కార్మికులకు కనీసం వేతనాలు ఇవ్వరు” అని కడియం పేపర్ మిల్లు యాజమాన్యంపై మంత్రి ఫైర్ అయ్యారు.కాలుష్య వ్యర్థాలను పరిశ్రమలు వదులుతుంటే వాటర్ వర్క్స్ ద్వారా ప్రజలు ఆ త్రాగునీటిని తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీనిని తీవ్రమైన అంశంగా పరిగణిస్తున్నామని అన్నారు. పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, ఉద్యోగాల కల్పన, రాయితీలు అందిస్తున్నప్పటికీ వారికి కేవలం ధనార్జనే ముఖ్యమైతే చూస్తూ ఊరుకోమన్నారు. మున్సిపాలిటీకి ఆంధ్రా పేపర్ మిల్లు కట్టాల్సిన రూ. 13 కోట్ల బకాయిలను నేటికీ కట్టలేదని, పలుమార్లు హెచ్చరించినా వారి నుండి సమాధానం లేదని, ఇకపై ఉపేక్షించే ప్రసక్తి లేదని, నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు ఉంటాయని మాస్ వార్నింగ్ ఇచ్చారు. ధనార్జన చూసుకున్నప్పటికీ, కార్మికుల సంక్షేమం చూసుకున్నప్పటికీ ప్రజల ప్రాణాలతో పరిశ్రమలు చెలగాటమాడొద్దన్నారు. పరిశ్రమలు గానీ, ఇతరులు గానీ మురుగును నేరుగా నదిలోకి వదిలితే ఇకపై బెదిరింపులకు తలొగ్గే ప్రసక్తే లేదు, చట్టప్రకారం నేరుగా జైలుకు పంపే తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు.

**రూ. 8,500 కోట్లతో గోదావరి మహా పుష్కరాల ప్రణాళిక.!**

13 నెలల్లో గోదావరి పుష్కరాలు రానున్నాయని మంత్రి తెలిపారు. ఈ ఏడాది కాలంలో వర్షాకాలం పోగా కేవలం 9 నెలల కాలం మాత్రమే అందుబాటులో ఉందని, ఈ తక్కువ కాలంలో ఏయే కార్యక్రమాలు చేయగలం అనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పుష్కరాలు జరిగే 6 జిల్లాల పరిధి కోసం దాదాపు రూ. 8,500 కోట్లతో భారీ ప్రతిపాదనలను సిద్ధం చేశామన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన కార్యక్రమాలపై చర్చించామని, పనులు శరవేగంగా ప్రారంభించి నాణ్యతతో ఉండేలా చూస్తామన్నారు. పుష్కరాలు జరిగే జిల్లాల్లోని ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలు ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడుకి పంపించామని, ఆయన క్రోడీకరించిన అనంతరం పూర్తి కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం లు ప్రత్యేక శ్రద్ధ వహించి పుష్కరాలను అద్భుతంగా నిర్వహించి ఇతోధికంగా నిధులు సమకూర్చాలని కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

**రూ.100 కోట్ల పంచాయతీరాజ్ నిధులు**

**-- ప్లాస్టిక్ రహిత పుష్కరాలు..**

గోదావరి పుష్కరాలు జరిగే 6 జిల్లాల్లో పంచాయతీరాజ్ శాఖ తరపున రూ. 100 కోట్ల నిధులు ఇచ్చేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ చూపించడం సంతోషకరమన్నారు. దీనికోసం గ్రామాల్లో ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి ఆయా ఘాట్లను బాగు చేసుకొని భక్తులకు సరైన పుణ్యస్నానం చేసేలా పంచాయతీరాజ్ శాఖ, గ్రామాలు, పరిపాలన విభాగాలు కలిసి యాక్షన్ ప్లాన్ తయారు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పుష్కరాలకు వచ్చే దాదాపు 10 కోట్ల మంది భక్తులకు స్వచ్ఛమైన, పవిత్రమైన జలాల్లో పుణ్యస్నానాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈసారి పుష్కరాలను పూర్తిగా ‘ప్లాస్టిక్ రహితం’గా నిర్వహించాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. డిప్యూటీ సీఎం సూచన మేరకు పంచాయతీల వారీగా స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గోదావరిని తల్లిగా భావించి వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. ఒక మోడల్ ఘాట్ ను ఏర్పాటు చేసి, దానిపై వచ్చే స్పందనను బట్టి అన్ని ఘాట్లను అదే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామన్నారు.

**- కుంభమేళా తరహాలో ఏర్పాట్లు**

**-- టెంట్ సిటీలు, హోమ్ స్టేలు..!!**

పుష్కర భక్తుల కోసం సాంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక హంగులతో కూడిన హోటళ్లతో పాటు హోమ్ స్టేలు, టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. కుంభమేళా తరహాలో ఈ పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. “ఏ ఘాట్‌లో స్నానం చేసినా ఒకే పుణ్యఫలం లభిస్తుందని భక్తులకు అవగాహన కల్పిస్తూ భక్తుల రద్దీని నియంత్రిస్తాం. మీడియా ప్రతినిధులు కూడా తమ బాధ్యతను గుర్తుచేస్తూ ఏ ఘాట్ లో స్నానం చేసినా పుణ్యం వస్తుందని ప్రజలకు తెలపాలి” అని కోరారు.

**- సినిమా రంగం అభివృద్ధి**

**-- నంది అవార్డుల పునరుద్ధరణ..!**

ఏపీలో సినిమా రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, పరిశ్రమ అభివృద్ధికి డిప్యూటీ సీఎం ఇచ్చిన విలువైన సలహాలను, సూచనలను తూచ తప్పకుండా పాటిస్తామని సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. దీనిపై త్వరలోనే సంబంధిత వర్గాలతో సుదీర్ఘంగా చర్చించి తదుపరి అడుగులు వేస్తామన్నారు. ఇటీవలే ఎఫ్ డీసీ కి ఛైర్మన్ , బోర్డు మెంబర్స్ ను నియమించామని, నంది అవార్డులు, నంది నాటకోత్సవాల నిర్వహణ, ఫిల్మ్ ఫెస్టివల్స్ పై టీమ్ పని చేస్తుందని స్పష్టం చేశారు.

**- జనసేన పార్టీ బలోపేతానికి వినూత్న వ్యూహం..**

కూటమి ధర్మాన్ని పాటిస్తూ ప్రజా సంక్షేమ పాలనను అందిస్తూనే, క్షేత్రస్థాయిలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమిష్టిగా కృషి చేస్తామని జనసేన నేత కూడా అయిన మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన కమిటీలను తన (కందుల దుర్గేష్), మంత్రి నాదెండ్ల మనోహర్ ల సారథ్యంలో ఏర్పాటు చేస్తామన్నారు.

# అభివృద్ధి,సంక్షేమమే టిడిపి జెండా ఎజెండా ఎమ్మెల్యే రాము

**–గుడివాడలో 10 వేదికల్లో వర్చువల్ మహానాడు**

**–కార్యకర్తలతో మమేకమైన ఎమ్మెల్యే రాము.**

**–వైసిపిపై ఎమ్మెల్యే రాము ఫైర్..ఏఐ వీడియోలతో అబద్ధాల ఫ్యాక్టరీలా ప్రతిపక్షం–కూటమి చేసిన అభివృద్ధిని తామే చేసినట్లు చెప్పుకునే స్థాయికి వైసీపీ దిగజారింది**

**–మహానాడు స్ఫూర్తితో స్థానిక ఎన్నికలకు సిద్ధం.**

**–నియోజకవర్గంలో 280 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు**

**–మంచి వ్యక్తి, అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే రాముకు మద్దతుగా ఉంటాం:జనసేన ఇన్చార్జి శ్రీకాంత్, సీనియర్ టిడిపి నేతలు**



గుడివాడ, మే 27 (అజయ్ నారగాని - నేటి శుభోదయ )అభివృద్ధి, ప్రజల సంక్షేమమే టిడిపి జెండా ఎజెండా అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమం రాష్ట్రంలో అందిస్తున్నామని,టిడిపి విజన్ ఏంటో సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ మహానాడు వేదికగా మనందరికీ చెప్పారనీ పేర్కొన్న ఎమ్మెల్యే రాము రాష్ట్రంలో, గుడివాడలో మనం చేసే మంచిని క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.తెలుగుదేశం పార్టీ వర్చువల్ మహానాడు గుడివాడ నియోజకవర్గంలో బుధవారం ఘనంగా కొనసాగింది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నియోజకవర్గంలోని 10 మహానాడు వేదికలను స్వయంగా పరిశీలించారు. సత్యనారాయణపురంలోని ఐఎంఏ హాల్, శ్రీరాంపురంలోని వెలమ కమ్యూనిటీ హాల్, రాజేంద్రనగర్ లోని జీవి పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్, జగన్నాథపురంలోని యార్లగడ్డ కళ్యాణ మండపం, వికేర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియం, లింగవరం కొల్లారెడ్డి ఫంక్షన్ హాల్, నందివాడ మండలం గొంగళ్లమూడి బాధరవాడ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.కార్యకర్తలతో సరదాగా మాట్లాడి ఉత్సాహపరిచిన ఎమ్మెల్యే రాము, సౌకర్యాలపై ఆరా తీశారు. “అంతా చాలా చక్కగా ఉంది” అని కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. పలుచోట్ల పార్టీ శ్రేణులు నృత్యాలతో సందడి చేశారు. కార్యకర్తలకు భోజనం వడ్డించి వారితో కలిసి ఎమ్మెల్యే సహ పంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ టిడిపి కుటుంబ సభ్యులందరికీ మహానాడు శుభాకాంక్షలు చెప్పారు. తెలుగువారి పసుపు పండుగ మహానాడు తొలిరోజు పార్టీ శ్రేణుల ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా జరిగిందనీ, రెండవరోజు కూడా ఇదే ఉత్సాహంతో పాల్గొనాలనీ విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వ మ్యాగజైన్‌లో గుడివాడలో సాధించిన ప్రగతి గురించి కొనియాడుతూ ప్రచురించారనీ, చెత్తను తొలగించడంలో మనం సాధించిన విజయానికి ఇదే కొలమానం అన్నారు. మన ప్రభుత్వంలో వాటర్ ట్యాంకులు లేకుండా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని,చెత్త రహితంగా గుడివాడను మార్చామని గర్వంగా చెబుతున్నాననీ ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు.గుడివాడలో 152 కోట్ల అభివృద్ధి పనులు మంజూరయ్యాయనీ,అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మెయిన్ రోడ్ల అభివృద్ధి, నూతన వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు త్వరలో జరుగుతాయన్నారు. గుడ్లవల్లేరు 46కోట్లు, రూరల్ లో 40కోట్లు, నందివాడ మండలంలో 32 కోట్ల ప్రాజెక్టులు త్వరలో పట్టాలు ఎక్కదున్నట్లు కార్యకర్తలకు ఎమ్మెల్యే రాము తెలిపారు.




నియోజకవర్గ అభివృద్ధికి మొత్తం 280 కోట్ల పనులు మంజూరయ్యాయనీ, ఇది మన కూటమి పనీతనానికి నిదర్శనం అన్నారు. ఇది శాంపిల్ మాత్రమేనని,రాబోవు ఏడాదిలో మరిన్ని కార్యక్రమాలను ప్రజలు చూస్తారనీ ఎమ్మెల్యే రాము అన్నారు. గుడివాడలో ఏ మూలకు వెళ్లినా కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు.ప్రతిపక్షాలు ఏఐ వీడియోలు క్రియేట్ చేసుకుంటూ అబద్ధాలతో బ్రతుకుతున్నాయనీ,అబద్ధాల ఫ్యాక్టరీగా మారిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని తామే చేసినట్లు చెప్పుకునే స్థాయికి వైసీపీ నేతలు దిగజారారనీ మండిపడ్డారు. పార్టీ శ్రేణులు దృఢంగా ఉండి ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టాలనీ పిలుపునిచ్చారు.గుడివాడలో బ్రహ్మాండంగా మహానాడు కార్యక్రమం జరిగిందనీ,పార్టీ నాయకులు, కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే నాకు ఎంతో సంతోషంగా ఉందనీ ఎమ్మెల్యే రాము హర్షం వ్యక్తం చేశారు. మహానాడు స్ఫూర్తిగా, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు పనిచేయాలనీ పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల డిజిటల్ పద్ధతిలో జరుగుతున్నా అందరం ఎంతో సంతోషంగా వేడుకల్లో పాల్గొన్నారన్నారు. గత ప్రభుత్వంలో పడిన కష్టాలు ఎదుర్కొని పార్టీని గెలిపించుకున్నామన్నారు. గుడివాడలో ఎమ్మెల్యే రాము నాయకత్వంలో రాష్ట్రంలో ఘనంగా మహానాడు జరుగుతోందనీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దుర్మార్గుడిని ఓడించి విజయం సాధించిన ఎమ్మెల్యే రాము గుడివాడను అభివృద్ధి పథంలో తీసుకెళు తున్నారనీ, మంచి వ్యక్తి, అభివృద్ధి ప్రదాత రాముకు మద్దతుగా ఉంటాం” అని ముక్తకంఠంతో నాయకత్వం నినదించారు . జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూరాష్ట్రంలో సీఎం చంద్రబాబు, గుడివాడలో ఎమ్మెల్యే రాము ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహానాడు జరగడం సంతోషకరమనీ,జనసేన తరపున టిడిపి శ్రేణులకు శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఐకమత్యంగా కలిసి పనిచేద్దాం” అని పిలుపునిచ్చారు.వివిధ క్లస్టర్లలో జరిగిన మహానాడు వేడుకల్లో ఏపీ స్టేట్ వేర్హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, సీనియర్ టిడిపి నాయకులు యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జి, లింగం ప్రసాద్, కంచర్ల సుధాకర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మహానాడు అబ్జర్వర్ ఎమ్మెస్ బెగ్, గుడివాడ టౌన్, రూరల్, నందివాడ మండలాల టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబయ్య, వాసే మురళి, దానేటి సన్యాసిరావు,క్లస్టర్ ఇన్చార్జిలు మాదాల సురేష్,సయ్యద్ జబీన్, నేరుసు కాశి, పంచమర్తి శ్రీనివాసరావు,తాతినేని మురళి,వంశీకృష్ణ, ఉబ్బల వెంకటేశ్వరరావు,పార్టీ నాయకులు పొట్లూరి కృష్ణారావు, యార్లగడ్డ సుధారాణి,గుండి మెడ రాఘవేంద్రరావు, కర్రే గిరి, కార్పొరేషన్ డైరెక్టర్లు మజ్జాడ నాగరాజు, దింట్యాల రాంబాబు, జనసేన నాయకులు సాయన రాజేష్, పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు, తెలుగు మహిళలు, తెలుగు యువత, టిడిపి అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్య ఫుడ్స్ ను పరిశీలించిన కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ



గుడివాడ: మే 27 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ )కృష్ణాజిల్లా కలెక్టర్ డి. కె. బాలాజీబుధవారం గుడివాడ మండలం రామన్‌పూడి గ్రామంలో ఉన్న ఆయుష్య ఫుడ్స్ ఫ్రూట్స్ అండ్ వెజిటేబుల్స్ మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించారు.ఈ సందర్భంగా యూనిట్ వ్యవస్థాపకులు వి. లక్ష్మీ ప్రసన్న యూనిట్‌లో జరుగుతున్న కార్యకలాపాలు, పండ్లు కూరగాయల ప్రాసెసింగ్ విధానం, నాణ్యత ప్రమాణాలు, అలాగే అమెరికాకు జరుగుతున్న ఎగుమతుల వివరాలను కలెక్టర్ కు వివరించారు.యూనిట్‌లో అమలు చేస్తున్న ప్రాసెసింగ్ విధానాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ యూనిట్ పనితీరును అభినందించారు. వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ఎగుమతులను మరింత విస్తరించాలని సూచించారు.కలెక్టర్ వెంట పామర్రు ఉద్యాన శాఖాధికారి జె. కీర్తి దేవ్, కంకిపాడు ఉద్యాన శాఖాధికారి ఇ.హర్ చంద్ తదితరులు ఉన్నారు.

## పులిపాటి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



బాపట్ల నేటి శుభోదయ మే 27 :బాపట్ల మండలం కంకటపాలెం గ్రామంలో పులిపాటి జెర్మియా వివాహ వేడుకల్లో పాల్గొని వధూ వరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి నాయకులు గవిని కృష్ణమూర్తిగారు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కొక్కిలిగడ్డ చెంచయ్య బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కటికల యెహోషువ బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ శేఖర్ సురేష్ శ్రీను నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాపట్లలో వైభవంగా ముగిసిన హనుమత్ జయంతి, కళ్యాణోత్సవ వేడుకలు



బాపట్ల నేటి శుభోదయమే 27:బాపట్ల పట్టణంలో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. పరాభవ నామ సంవత్సర వైశాఖ మాసం నుండి ఆలయంలో అత్యంత వైభవంగా జరుగుతున్న హనుమత్ జయంతి, కళ్యాణోత్సవాల 16 రోజుల పండుగ ముగింపు వేడుకలు జేష్ఠ మాస శుద్ధ ఏకాదశి సందర్భంగా బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి.ఈ ముగింపు వేడుకల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు స్వామివారికి చతుర్దశ క్షీర కళాశాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా సాయంత్రం ఏడు గంటలకు స్వామివారికి విశేష పూలంగి సేవ, ఉంజల్ సేవ (ఊయల సేవ) నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామివారి హోమరక్షను అందజేశారు.ఈ పవిత్ర ముగింపు వేడుకలలో యావన్మంది భక్తులు స్వయంగా పాల్గొని స్వామివారిని అర్చించి, సేవించి, తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ వేడుకల విజయవంతానికి భక్తులు తమ యధాశక్తి సహకారాన్ని అందించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు త్యాగనిరతి, సేవాభావమే పండుగ సందేశం - విన్నకోట సురేష్.




బాపట్ల నేటి శుభోదయమే 27 : త్యాగం, భక్తి, సేవాభావానికి నిలువుటద్దం బక్రీద్ పండుగ. పేదలకు సాయం చేయడమే పండుగ అసలైన అంతరార్థం. సమాజంలో సౌభ్రాతృత్వాన్ని, మానవతా విలువలను బలోపేతం చేయాలి. మత సామరస్యాన్ని పాటిస్తూ ఐక్యతతో పండుగను జరుపుకోవాలి. జిల్లా ప్రజలందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన జనసేన నాయకులు విన్నకోట సురేష్.పవిత్రమైన బక్రీద్ (ఈద్-ఉల్-జుహా) పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు, ముఖ్యంగా ముస్లిం సోదర సోదరీమణులకు అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు, బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విన్నకోట సురేష్ మాట్లాడుతూ, “బక్రీద్ పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, అది దైవంపై భక్తిని, మానవునిపై కరుణను చాటిచెప్పే గొప్ప పర్వదినం. అల్లాహ్ పట్ల అపారమైన విశ్వాసంతో, ఇబ్రహీం ప్రవక్త చూపిన త్యాగనిరతి మనందరికీ ఆదర్శనీయం. సమాజంలో నిస్సహాయులకు, పేదలకు సాయం చేయడం, ఆనందాన్ని పంచుకోవడమే ఈ పండుగలోని అసలైన పరమార్థం” అని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో సౌభ్రాతృత్వాన్ని, పరస్పర గౌరవాన్ని మానవతా విలువలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సురేష్ అన్నారు. “మత సామరస్యాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత. కులమతాలకు అతీతంగా, అన్ని వర్గాల ప్రజలు ఒకరికొకరు తోడుగా ఉంటూ, పరస్పర ప్రేమాభిమానాలతో ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలి” అని ఆయన పిలుపునిచ్చారు. తమ ‘అఖండ ఫౌండేషన్’ ద్వారా నిరంతరం ప్రజాసేవలో భాగస్వాములవుతున్నామని, బక్రీద్ వంటి పవిత్ర దినాల్లో పేదలకు అండగా నిలవడం గొప్ప విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పవిత్ర దినం ప్రతి కుటుంబంలో ఆనందం, ఐక్యత, శాంతి సౌఖ్యాలను నింపాలని, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రజలందరూ ఐక్యంగా కృషి చేయాలని సురేష్ ఆకాంక్షించారు. చివరిగా, జిల్లా ప్రజలందరికీ బక్రీద్ పండుగతో సుఖసంతోషాలు కలగాలని ఆయన కోరారు.

## కనపడ కొండ పోయిన బంగారు వస్తువుల్ని వెతికించిన చందోలు ఎస్ఐ మర్రి వెంకట్ శివకుమార్



బాపట్ల నేటి శుభోదయమే 27 : పిట్టలవానిపాలెం లోని జూపూడి శ్రీనివాసరావు ఇంట్లో దొంగతనం జరిగి రెండు షవర్ల బంగారపు గొలుసు వెండి ప్లేటు దొంగలించబడినదని వచ్చిన ఫిర్యాదు మేరకు బాపట్ల డిఎస్పి గారి ఆదేశానుసారం బాపట్ల రూరల్ సర్కిల్ సిఐ గారి ఉత్తర్వుల మేరకు చందోలు ఎస్సై మర్రి శివకుమార్ మరియు సిబ్బంది శ్రీనివాసరావు ఇంటి వద్దకు వెళ్లి బీరువాను పరిశీలించగా వారు దొంగలించబడినవని చెప్పిన వస్తువులు బీరువాలోనే ఉన్నవి శ్రీనివాసరావు భార్య అయిన శ్రీ లక్ష్మి చీరాల వెళుతూ సదరు వస్తువులను బీరువాలో మరొకచోట పెట్టినది. అది గమనించకుండా శ్రీనివాసరావు తన ఇంట్లో దొంగతనం జరిగినదని ఫిర్యాదు ఇవ్వటం జరిగినది.

## పసుపు జోష్‌తో పలికిన మహానాడు

### పులిచెర్లలో తెలుగు తమ్ముళ్ల సందడి



పులిచెర్ల, మే 27,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలంలో బుధవారం టిడిపి శ్రేణులు పసుపు ఉత్సాహంతో మహానాడు వేడుకలను ఘనంగా ప్రారంభించాయి. పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.కల్లూరు సమీపంలో ఏర్పాటు చేసిన మహానాడు సభా వేదికను పసుపు రంగులతో ఆకట్టుకునేలా అలంకరించారు. మహానాడు సందర్భంగా పులిచెర్ల నుంచి కల్లూరు వరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పసుపు జెండాలు ఊపుతూ “జై తెలుగుదేశం” నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది.ఈ సందర్భంగా మాట్లాడిన చల్లా రామచంద్రారెడ్డి, తెలుగుదేశం పార్టీ ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.అనంతరం టిడిపి కేంద్ర కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రసంగించిన నారా లోకేష్ సందేశాన్ని నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## బాపట్లలో ఘనంగా ప్రారంభమైన ‘డిజిటల్ మహానాడు’ పాల్గొన్న బాపట్ల శాసనసభ్యులు శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు



బాపట్ల నేటి శుభోదయ మే 27:తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు గారి పిలుపు మేరకు బాపట్ల నియోజకవర్గంలో “డిజిటల్ మహానాడు” కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు గారి ఆధ్వర్యంలో స్థానిక ‘వి కన్వెన్షన్ హాల్’ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి డిజిటల్ మహానాడు పండుగను అధికారికంగా ప్రారంభించారు.మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుండి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో జరుగుతున్న మహానాడు ప్రత్యక్ష ప్రసారాన్ని ఎమ్మెల్యే నాయకులు,




కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## “ఉమామహేశ్వరం ఇనాం గ్రామంలో 39 మంది రైతులకు 83.64 ఎకరాల ఇనాం భూములపై రైతువారి పట్టాల పంపిణీ

### రైతులకు శాశ్వత భూ హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్



పెంటపాడు మే 27 (అవినాష్ మారంపూడి నేటి-శుభోదయ). పెంటపాడు మండలం ఉమామహేశ్వరం (ఇనాం భూములు)లలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇనాం భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ అర్హులైన రైతులకు రైతువారి పట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని 39 మంది రైతులకు మొత్తం 83.64 ఎకరాల ఇనాం భూములకు సంబంధించిన రైతువారి పట్టాలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఇనాం భూముల సమస్యలను పరిష్కరించి రైతులకు భూ హక్కులు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమమని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను పూర్తిస్థాయి పరిశీలన అనంతరం ఎంపిక చేసి పట్టాలు జారీ చేశామని పేర్కొన్నారు. త్వరలోనే రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా అందజేయనున్నట్లు తెలిపారు. భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఆన్‌లైన్ నమోదు పూర్తైన వెంటనే అడంగల్ రికార్డుల్లో భూ యజమానుల పేర్లు నమోదవుతాయని తెలిపారు. జిల్లాలో ప్రతి రైతుకూ తప్పులులేని పట్టాదారు పాస్ పుస్తకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇనాం భూముల సమస్య పరిష్కారంలో గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది అందించిన సహకారానికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. భూములకు సంబంధించిన సందేహాలు ఉంటే సంబంధిత మండల తహసీల్దార్‌ను సంప్రదించాలని రైతులకు సూచించారు.శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రైతుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి పారదర్శకతతో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశామని తెలిపారు. మొదటి విడతలో భాగంగా 39 మంది రైతులకు రైతువారి పట్టాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ పట్టాల ద్వారా రైతులకు భూములపై పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తాయని, తద్వారా బ్యాంకు రుణాలు, పంట పెట్టుబడి సాయం, ఇతర ప్రభుత్వ పథకాలు సులభంగా పొందగలరని తెలిపారు. అదేవిధంగా ఈ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.1.96 లక్షలు అందజేసినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని వికలాంగులకు పింఛన్లు నిరంతరంగా అందేలా దాతల సహకారంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఇన్‌చార్జి ఆర్డీవో కే.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ సునీల్ కుమార్ చేతుల మీదుగా రైతులకు పట్టాలు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముందుగా గ్రామస్తులు మంగళ వాయిద్యాలతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు. గ్రామ దేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం గ్రామంలోని చిన్నారులతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోలాటం ఆడి గ్రామస్తులను ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, మండల తహసీల్దార్ సునీల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలక్ష్మి, ఎంపీడీవో రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు, వీఆర్వోలు, కూటమి నాయకులు ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి, బిజెపి ఇన్చార్జ్ ఈతకోట తాతాజీ, పాలూరి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మద్దుకూరి రామకృష్ణ స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు మరియు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుండి ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్ పూర్తిగా మూసివేత

విజయవాడ, మే 27 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఘాట్ రోడ్ మరమత్తు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో, భక్తుల భద్రత దృష్ట్యా ఘాట్ రోడ్ వైపు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ ఈఓ శీనా నాయక్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం శ్రీ కనకదుర్గ నగర్ వైపు నుండి ప్రత్యామ్నాయ రాకపోకలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.బుదవారం సాయంత్రం 4 గంటలకు ఈవో చాంబర్‌లో ఘాట్ రోడ్ మూసివేత, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, తీసుకోవాల్సిన చర్యలపై ఈవో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.హెచ్.వి.ఎస్.ఎన్. కిషోర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీమతి రమాదేవి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ బి.వి. రెడ్డి, పి.చంద్రశేఖర్, శ్రీమతి పి.సుధారాణి, ఎన్.రమేష్ బాబు, కె.గంగాధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.భక్తుల సౌకర్యార్థం ప్రస్తుతం ఘాట్ రోడ్డులో ఉన్న ప్రోటోకాల్ ఆఫీస్‌ను తక్షణమే కొండ దిగువన శ్రీ కనకదుర్గ నగర్‌లో కొత్తగా నిర్మించిన భవనంలోకి మార్చడానికి ఆదేశాలు జారీ చేశారు. కొత్త ప్రోటోకాల్ ఆఫీస్ వద్ద భక్తుల రవాణా కొరకు ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో తగినన్ని బ్యాటరీ వాహనాలను నిరంతరం అందుబాటులో ఉంచుతారు.భక్తుల రద్దీని నియంత్రించడానికి ఘాట్ రోడ్ లో ఉన్న టికెట్ కౌంటర్ సిబ్బందిని కొత్త ప్రోటోకాల్ ఆఫీస్ వద్దకు మార్పు చేశారు. అలాగే కొత్త ప్రోటోకాల్ ఆఫీస్ నుండి మహా మండపం వరకు అదనపు సెక్యూరిటీ గార్డులను, సూపర్‌వైజర్లకు విధులు కేటాయింపు. ప్రోటోకాల్ పరిధిలోకి వచ్చే భక్తుల దర్శనాల కోసం మహా మండపం వద్ద ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యేక పాయింట్‌ను ఏర్పాటు చేశారు. నిత్య పూజలు, సేవల కొరకు కొండపైకి వచ్చే భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఫెస్టివల్ విభాగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఘాట్ రోడ్ మూసివేత, ప్రత్యామ్నాయ మార్గాల గురించి భక్తులకు అవగాహన కల్పించేందుకు ఆలయ పరిసరాల్లో మైక్ ద్వారా నిరంతరం అనౌన్స్‌మెంట్స్ (ప్రచారం) చేయాల్సిందిగా ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా గల ప్రదేశం లో వాహనాల పార్కింగ్ కు, సీతమ్మవారి పాదాలు నుండి, కుమ్మరి పాలెం సెంటర్ నుండి, పున్నమి ఘాట్ నుండి నిరంతరం దేవస్థానం బస్సులు ఏర్పాటు కు చర్యలు.”ఘాట్ రోడ్ మరమత్తు పనుల దృష్ట్యా భక్తుల భద్రతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకోబడిందని ఈఓ తెలిపారు.సుమారు 15 రోజుల పాటు ~ూా గవర్నమెంట్ =ఉదీ శాఖ వారి ఆధ్వర్యంలో జరిగే ఈ పనుల నిమిత్తం దేవస్థానం అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి. భక్తులు కూడా ఆలయ సిబ్బందికి సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకోవాల్సిందిగా కోరారు.”కేవలం వృద్దులకు, వికలాంగులకు, చంటి బిడ్డల తల్లులకు మాత్రమే లిఫ్ట్ వైపు నుండి కొండపైకి ప్రవేశం ఉంటుందని,మహా మండపం మెట్ల మార్గంలో కొండ పైకి చేరేందుకు ఏర్పాటు చేసామని ఈవో వికె శీనా నాయక్ పేర్కొన్నారు.

## 3 కోట్లతో డా॥ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో నూతన భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బోండా ఉమా శ్రీకారం



విజయవాడ, మే 27 (నేటి శుభోదయ):- బందరు రోడ్డులోని విజయ్ కృష్ణ సూపర్ బజార్ పక్కన ఉన్న డా॥ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో 3 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న నూతన భవన నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని బుదవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయుర్వేద విద్యాసంస్థలకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.గతంలో 2014--2019 మధ్య చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఆయుర్వేద విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ ఆయుర్వేద కళాశాలలో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా విద్యార్థులు వచ్చి పీజీ విద్యను అభ్యసిస్తున్నారని ఉమా అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆయుష్ శాఖ కారణంగా గత పదిహేనేళ్లుగా ప్రజల్లో ఆయుర్వేదంపై అవగాహన, విశ్వాసం మరింత పెరిగిందన్నారు. నేచురల్ ట్రీట్మెంట్స్‌కు ప్రజలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని,విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు భవనాల విస్తరణ, ఆధునిక పరికరాల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలు అవసరమని చెప్పారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 30 పీజీ సీట్లను 60 సీట్లకు పెంచినట్లు తెలిపారు. అలాగే కాలేజీ అభివృద్ధి కోసం స్థలం కేటాయింపు, కొత్త భవనాల నిర్మాణం వంటి చర్యలు చేపట్టినట్లు ఉమా తెలిపారు.ఈ కాలేజీకి ప్రతిరోజూ అనేక మంది రోగులు, విద్యార్థులు వస్తుండటంతో రాష్ట్ర స్థాయిలో దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రస్తుతం 3 కోట్ల వ్యయంతో అదనపు భవనాలు, వసతుల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.సెంట్రల్ నియోజకవర్గంలో ఈ ప్రతిష్టాత్మక కాలేజీ ఉండటం గర్వకారణమని పేర్కొంటూ, ఇక్కడ చదివే విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం తరపున, స్థానిక ఎమ్మెల్యేగా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఉమా హామీ ఇచ్చారు.కాలేజీ సిబ్బంది కూడా ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారని ప్రశంసిస్తూ, కాలేజీ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. 3 కోట్ల అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి కాలేజీకి అందజేస్తామని ఉమా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, చింతా దుర్గారావు, బుల్లయ్య , ఆస్పత్రి యాజమాన్యం, మెడికల్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

## శ్రీ కనక దుర్గమ్మ వారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్ కుటుంబం




విజయవాడ, మే 27 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్ వారి సతీమణితో కలిసి శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ ఈఓ వి.కె. శీనానాయక్ స్వాగతం పలికారు. వి.కె. శీనానాయక్, ఉప ప్రధాన అర్చకులు శంకర్ శాండిల్య, అర్చకుల బృందం దగ్గరుండి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు న్యాయమూర్తి దంపతులకు వేద ఆశీర్వచనం అందించి, అమ్మవారి ప్రసాదాలను, శేషవస్త్రాన్ని, శ్రీ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

## : “పోలీసు వాహనం బహూకరించిన ఎమ్మెల్యే బొలిశెట్టి”

తాడేపల్లిగూడెం మే 27(అవినాష్ మారంపూడి నేటి-శుభోదయ) ::: పోలీసుల విధినిర్వహణకు రూ.9లక్షలు విలువైన బొలిరో నూతన వాహనాన్ని తన సొంత నిధులతో కొనుగోలుచేసి గ్రామీణ పోలీస్ స్టేషన్ కు బహూకరించిన శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కు జిల్లా ఎస్ పి అద్నాన్ నయీమ్ అస్మి ధన్యవాదాలు తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించటానికి కృషి చేస్తామని అన్నారు.తాడేపల్లిగూడెం గ్రామీణ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలోనూతన వాహనాన్ని ఎస్ పి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో స్నేహభావంతో విధి నిర్వహణ చేయాలని అన్నారు.టౌన్ పోలీస్ స్టేషన్ కు కూడా మిత్రుల సహకారంతో మరొక వాహనాన్ని అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉన్న దృష్ట్యా దాతల సహకారంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్, ఎమ్మార్వో రాజరాజేశ్వరి, సిఐలు రవికుమార్ ఆది, ఎస్సైలు రవికుమార్, స్వామి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వాహనంబహూకరించిన ఎమ్మెల్యే బొలిశెట్టి తాడేపల్లిగూడెం: పోలీసుల విధినిర్వహణకు రూ.9లక్షలు విలువైన బొలిరో నూతన వాహనాన్ని తన సొంత నిధులతో కొనుగోలుచేసి గ్రామీణ పోలీస్ స్టేషన్ కు బహూకరించిన శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కు జిల్లా ఎస్ పి అద్నాన్ నయీమ్ అస్మి ధన్యవాదాలు తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించటానికి కృషి చేస్తామని అన్నారు.తాడేపల్లిగూడెం గ్రామీణ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలోనూతన వాహనాన్ని ఎస్ పి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో స్నేహభావంతో విధి నిర్వహణ చేయాలని అన్నారు.టౌన్ పోలీస్ స్టేషన్ కు కూడా మిత్రుల సహకారంతో మరొక వాహనాన్ని అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉన్న దృష్ట్యా దాతల సహకారంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్, ఎమ్మార్వో రాజరాజేశ్వరి, సిఐలు రవికుమార్ ఆది, ఎస్సైలు రవికుమార్, స్వామి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ జీవనది లాంటిది-టీడీపీలో కార్యకర్తే అధినేత మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



విజయవాడ, మే 27 (నేటి శుభోదయ):- తెలుగుదేశం పార్టీ జీవనది లాంటిది, టీడీపీలో కార్యకర్తే అధినేత, కార్యకర్తలే పార్టీకి నిజమైన బలమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు స్పష్టం చేశారు.విజయవాడ రూరల్ మండలం జేఎన్ఎన్యూఆర్ఎం కాలనీలో క్లస్టర్ 10 పరిధిలో టీడీపీ వర్చువల్ మహానాడును ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న మహానాడు ప్రధాన వేదిక కార్యక్రమాన్ని భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా కార్యకర్తలకు ప్రత్యక్ష ప్రసారం చేశారు.క్లస్టర్ 10 పరిధిలోని టీడీపీ నాయకులు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జిలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కేవలం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు.దార్శనికుడైన సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. అన్న ఎన్టీఆర్ ఆశయాల సాధనే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. డిజిటల్ విప్లవంతో నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని పాలనలో పారదర్శకత తెస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.వర్చువల్ మహానాడు నిర్వహణతో సమయం, ఇంధనం ఆదా అవుతుందని, ఖర్చు కూడా తగ్గిందని వివరించారు.మై టీడీపీ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల సమాచారం క్షణాల్లో కార్యకర్తలకు చేరుతోందన్నారు.టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పార్టీలో నూతనోత్సాహం వచ్చిందని కొనియాడారు.యువతను రాజకీయాల్లో ప్రోత్సహిస్తూ లోకేష్ పార్టీకి నూతన జవసత్వాలు నింపుతున్నారని తెలిపారు.కూటమి ప్రభుత్వ పాలనలో రైతు, పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేశామని వివరించారు.పెన్షన్ల పెంపు, సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రజల్లో సంతృప్తి ఉందన్నారు.మహానాడు తీర్మానాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రతి ఇంటికి కూటమి పాలన విజయాలు చేర్చాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రీట్ ఫుడ్ హబ్స్ ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, మే 27 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో స్ట్రీట్ ఫుడ్ హబ్స్ ఏర్పాటు అంశంపై మెప్మా వారు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న పీఎంఎస్‌వానిధి పథకం కింద పర్యాటక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత గల ప్రాంతాలలో స్ట్రీట్ ఫుడ్ హబ్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలపై తన ప్రతిపాదన తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అధిక జనసంచారం, పర్యాటక రద్దీ ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశారని, స్ట్రీట్ ఫుడ్ హబ్స్ ద్వారా వీధి వ్యాపారులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహార విక్రయ కేంద్రాలను అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు.ఫుడ్ హబ్స్‌లో మహిళలు, పురుషులకు ప్రత్యేక మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్, లైటింగ్, పార్కింగ్, అగ్నిమాపక భద్రత, సీసీ కెమెరా నిఘా వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అదేవిధంగా ఘన వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత ప్రమాణాలు పాటించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని పేర్కొన్నారు.

# తూర్పులో 21వ డివిజన్లు, 11 క్లస్టర్లల్లో ఘనంగా హైబ్రిడ్ మహానాడు

పసుపు తోరణాలు, జెండాలతో పసుపుమయంగా మారింది



విజయవాడ, మే 27 (నేటి శుభోదయ):- మహిళలకు విద్యా అవకాశాలు, ఆస్తి హక్కుల్లో వాటా, డ్వాక్రా సంఘాలు ఏర్పాటు వంటి ఎన్నో బృహత్తర కార్యక్రమాలను నిర్వహించి మహిళలను మరింత శక్తిమంతులుగా మార్చిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఉద్ఘాటించారు. బుధవారం ఉదయం తూర్పులో 21 డివిజన్లలోని 11 క్లస్టర్లల్లో జరిగిన హైబ్రిడ్ మహానాడును ఎమ్మెల్యే గద్దె పరిశీలించారు. మహానాడు నిర్వహణ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రధాన, అంతర్గత రహదారులు అన్నీ పసుపు తోరణాలు, పసుపు జెండాలతో నియోజకవర్గం మొత్తం పసుపుమయంగా మారింది. నియోజకవర్గంలో 11 చోట్ల జరుగుతున్న హైబ్రిడ్ మహానాడు సభలను గద్దె పరిశీలించి నాయకులతో మాట్లాడి వారిని మరింతగా ఉత్సాహ పరిచారు.ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ అన్న నందమూరి తారక రామారావు అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని స్థాపించడమే కాకుండా ఆస్తి హక్కుల్లో వాటా కల్పించారని చెప్పారు. రాజకీయపరంగా కూడా మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత కూడా తమ పార్టీదేనని గుర్తుచేశారు. నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలను ఆర్థికంగా మరింతగా బలోపేతం చేశారని తెలిపారు. దీపం పథకం అమలుతో మహిళల జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించారని, తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో రూ.15వేలు జమ చేశారని చెప్పారు. ఈ విధంగా మహిళలను అన్ని రకాలుగా శక్తిమంతులుగా మార్చిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని చెప్పారు. తెలుగుదేశం పార్టీ జెండా నీడలోనే మహిళలకు భద్రత, గౌరవం లభిస్తాయని ఉద్ఘాటించారు. టీడీపీ జాతీయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న మొదటి మహానాడులో పార్టీ నాయకులు, కార్యకర్తలు చాలా ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. నారా లోకేష్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించాక పార్టీ మరింత శక్తివంతం అయ్యిందని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. నారా చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నసంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధి, మహిళా సంక్షేమానికి తీసుకున్న చర్యల గురించి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రచారం చేయాలని కోరారు. అన్ని క్లస్టర్లలోనూ పెద్ద ఎత్తున మహిళలు శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డివిజన్ల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల అధ్యక్షులు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహానాడు తొలిరోజును జయప్రదం చేశారు.

## మహిళలకు 33% సీట్లు...

## టీడీపీతోనే నిజమైన మహిళా సాధికారత గద్దె అనురాధ



విజయవాడ, మే 27 (నేటి శుభోదయ):- పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ అయినా, అవ్వకపోయినా మహిళలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడం తెలుగుదేశం పార్టీ సంకల్పమని, బాధ్యత అని, టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ పేర్కొన్నారు. మహానాడు వేదికగా వచ్చే ఎన్నికల్లో 33 శాతం సీట్లు మహిళలకు ఇవ్వాలని నారా లోకేష్ చేసిన ప్రతిపాదన మహిళా సాధికారత పట్ల టీడీపీకి ఉన్న చిత్తశుద్ధిని మరోసారి దేశానికి చాటి చెప్పిందన్నారు. మహిళలను కేవలం ఓటర్లుగా కాకుండా నాయకత్వ స్థానాల్లో నిలబెట్టాలనే దృఢ సంకల్పంతోనే టీడీపీ ముందుకు సాగుతోందని తెలిపారు. మహిళలకు గౌరవం, హక్కులు, రాజకీయ ప్రాధాన్యత ఇవ్వడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ దేశానికి ఆదర్శంగా నిలిచిందని గద్దె అనురాధ పేర్కొన్నారు. మహానేత ఎన్టీఆర్ మహిళలకు కుటుంబ ఆస్తిలో సమాన హక్కులు కల్పించి చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి లక్షలాది మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దారని అన్నారు. పసుపు-కుంకుమ, వడ్డీ లేని రుణాలు, మహిళా భద్రత కోసం ప్రత్యేక చర్యలు, విద్య మరియు ఉపాధిలో ప్రోత్సాహకాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు టీడీపీ ప్రభుత్వాల నుంచే వచ్చాయని తెలిపారు. ఇప్పుడు మహిళలకు రాజకీయ అధికారంలోనూ సముచిత భాగస్వామ్యం కల్పించేందుకు 33 శాతం సీట్ల ప్రతిపాదన తీసుకురావడం మహిళా చరిత్రలో మరో స్వర్ణాక్షర ఘట్టమని అనురాధ పేర్కొన్నారు.ఇతర పార్టీలు మహిళా సాధికారతపై కేవలం మాటలు చెబుతుంటే టీడీపీ మాత్రం ఆచరణలో చూపించే పార్టీ అని అనురాధ స్పష్టం చేశారు. మహిళలు నిర్ణయాత్మక స్థానాల్లో ఉంటేనే సమాజం మరింత బలపడుతుందని, రాష్ట్ర అభివృద్ధికి మహిళల భాగస్వామ్యం అత్యంత అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళల గౌరవం, ఆత్మవిశ్వాసం, రాజకీయ ఎదుగుదలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మహిళా లోకం నారా లోకేష్ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి ఘన స్వాగతం పలుకుతోందని గద్దె అనురాధ పేర్కొన్నారు.

## సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీతో సెన్సస్

## 2027 నమోదు పూర్తి చేసిన వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, మే 27 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, చీఫ్ సెన్సస్ ఆఫీసర్ ధ్యానచంద్ర బుధవారం సెన్సస్--2027 కార్యక్రమంలో భాగంగా గత నెలలో తాను పూర్తి చేసిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ వివరాలను ఉపయోగించి వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సిటీ సెన్సస్ ఆఫీసర్, అదనపు కమిషనర్ ఏ.రవీంద్ర రావు సమక్షంలో నమోదు ప్రక్రియను పూర్తి చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసుకున్న ప్రజలు తమకు వచ్చిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీని ఎన్యూమరేటర్లకు అందజేసి సెన్సస్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. దీనివల్ల సమాచారం సులభంగా ధృవీకరణకు రావడంతో పాటు గణన ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు.సెన్సస్--2027 దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, ప్రతి కుటుంబం తప్పనిసరిగా సహకరించాలని సూచించారు. ప్రజలు సరైన వివరాలను అందించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు ఖచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సిటీ సెన్సస్ ఆఫీసర్, ఆదనపు కమిషనర్ ఏ. రవీంద్ర రావు, సెన్సెస్ సూపర్వైజర్, టీపీవో గిరి, ఎన్యూమరేషన్ లీల ప్రశాంత్ పాల్గొన్నారు.

## నేటి తరాల నటులకు అతని చరిత్ర ఒక నిఘంటువు

అతని సేవలు చిరస్మరణీయం


( 28 మే నందమూరి తారక రామారావు జన్మదిన వేడుక సందర్భంగా అతనికి నీరాజనాలు వందనాలు బక్రీద్ పర్వదినం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక



పులిచెర్ల, మే 27,(నేటి శుభోదయ) :పులిచెర్ల మండల ముస్లిం సోదర సోదరీమణులకు మండల ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ త్యాగనిరతి, మానవతా విలువలను చాటిచెప్పే పవిత్ర పండుగ అని ఎంపీపీ పేర్కొన్నారు.ఈ పండుగ ప్రతి ఇంట ఆనందాలు నింపాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మత సామరస్యం, సోదరభావం మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ కలిసి పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆయన సూచించారు.

# ఖమ్మం ప్రెస్ క్లబ్ పై విచారణకు కలెక్టర్ ఆదేశం

- టీడబ్ల్యూజేఎఫ్ ఫిర్యాదుపై స్పందించిన టి.ఎస్.దివాకర- డీపీఆర్వోతో కలిసి దర్యాప్తు జరుపుతామని టీడబ్ల్యూజేఎఫ్ నేతలకు డీసీవో గంగాధర్ హామీ



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా కేంద్ర ప్రెస్ క్లబ్ వేదికగా సాగుతున్న ఆర్థిక, అక్రమ వ్యవహారాలపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. క్లబ్ నిర్వహణలో పారదర్శకత లోపించిందని, నిధుల దుర్వినియోగం జరుగుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ ఇచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ టి.ఎస్.దివాకర స్పందించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీవో)ని ఆదేశించారు.

### - టీడబ్ల్యూజేఎఫ్ నేతలతో డీసీవో సమావేశం



కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీవో గంగాధర్ బుధవారం టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి (డీపీఆర్వో) గౌస్ పాషాతో కలిసి ఉమ్మడిగా ఈ అక్రమాలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపడతామని జర్నలిస్టు నేతలకు స్పష్టమైన హామీ ఇచ్చారు.

### - ఆదాయ, వ్యయాలపై ఆడిటింగ్ జరపాలి : టీడబ్ల్యూజేఎఫ్

గత పదేళ్లుగా ప్రెస్ క్లబ్‌ను కేవలం రెండు యూనియన్ల నాయకులు తమ గుత్తాధిపత్యంలో ఉంచుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి డీసీవో దృష్టికి తీసుకెళ్లారు. ప్రెస్ మీట్ల ద్వారా వస్తున్న ఆదాయం, క్లబ్ ఖర్చులు, బిల్లులను బహిర్గతం చేయకుండా అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చివరకు జిల్లా కలెక్టర్‌కే ప్రెస్ క్లబ్ వ్యవహారాలపై ఉన్న అధికారాలేంటంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో (సోషల్ మీడియా) పోస్టులు పెట్టే స్థాయికి తెగబడ్డారని వివరించారు. ప్రెస్ క్లబ్ నిర్వహణ సక్రమంగా సాగాలంటే గత పదేళ్ల ఆర్థిక లావాదేవీలపై ఆడిటింగ్ నిర్వహించడంతో పాటు, యూనియన్ కో రేటుతో ప్రెస్ మీట్ దారులకు రసీదులు ఇవ్వకుండా ఇష్టానుసార వసూళ్లపై విచారణ, నిబంధనల ప్రకారం వెంటనే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు విజ్ఞప్తి చేశారు.

### - టీడబ్ల్యూజేఎఫ్‌లోకి భారీ చేరికలు

ప్రెస్ క్లబ్ అక్రమాలపై టీడబ్ల్యూజేఎఫ్ సాగిస్తున్న పోరాటానికి మద్దతుగా ఆ యూనియన్ లోకి జర్నలిస్టుల చేరికలు భారీగా పెరిగాయి. సీనియర్ జర్నలిస్టులు టీఎస్ చక్రవర్తి, మందడపు మనోహర్, వేర్పుల నాగేశ్వరరావు, కుర్రా సంపత్ చౌదరి, కుంభం రవికుమార్ ల ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వివిధ పత్రికలకు చెందిన 40 మందికి పైగా రిపోర్టర్లు బుధవారం ఈ యూనియన్ లో చేరారు. వీరందరికీ యూనియన్ జిల్లా నాయకులు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులుసయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, సివిఆర్ శ్రీనివాస్, కొత్త రాకేష్, షేక్ జానీ పాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, మధుశ్రీ, దగ్గుపాటి మాధవరావు, ఉపేందర్, కుంభం రవికుమార్, వేర్పుల నాగేశ్వరరావు, సంపత్ చౌదరి, కొరకొప్పుల రాంబాబు, టీఎస్ చక్రవర్తి, హర్షద్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ నియోజకవర్గంలో ఘనంగా వర్చువల్ మహానాడు

-2026 సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధిపై మినీ మహానాడులో కీలక తీర్మనాలు

విజయవాడ, మే 27 (నేటి శుభోదయ):- విజయవాడ సెంట్రల్ లోని 11 క్లస్టర్లలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో వర్చువల్ మహానాడు-2026 కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. క్లస్టర్ల నంబర్లు 1,2,3,4,5,7,11 ప్రాంతాల్లో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న మహానాడు ప్రధాన కార్యక్రమాన్ని క్లస్టర్ల వారీగా భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడంతో కార్యకర్తలు, మహిళలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ "మై టీడీపీ యాప్" ద్వారా ప్రతి కార్యకర్తకు మహానాడులో భాగస్వామ్యం కల్పిస్తున్నామని తెలిపారు. యువత, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, వ్యాపారులు అందరూ ఇంటి వద్ద నుంచే స్మార్ట్‌ఫోన్ ద్వారా మహానాడు కార్యక్రమాలను వీక్షించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.యూట్యూబ్, జూమ్ యాప్, మీడియా ఛానళ్ల ద్వారా మహానాడు కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని, పార్టీ అధ్యక్షుడు, ముఖ్య వక్తలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు చేసే ప్రసంగాలను కార్యకర్తలు ఎక్కడి నుంచైనా వీక్షించే అవకాశం కల్పించామని పేర్కొన్నారు.మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా యువత అభిప్రాయాలు, కార్యకర్తల సూచనలు, ప్రజల ఆకాంక్షలను స్వీకరించి వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో మహానాడును మరింత విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.సెంట్రల్ నియోజకవర్గ మినీ మహానాడులో1. గుణదల -- ఉలవచారు కంపెనీ మార్గంలో ఫ్లైఓవర్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని,2. గుణదల -- డాన్ బాస్కో స్కూల్ మార్గంలోని ఫ్లైఓవర్ పనులను త్వరితగతిన చేపట్టాలని,3. బుడమేరు ముప్పును శాశ్వతంగా నివారించే చర్యలు చేపట్టాలని,4. మధురానగర్ పప్పుల మిల్లు -- వాంబే కాలనీ మార్గంలో ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభించాలని,5. జీఓ-30 ప్రకారం రిజిస్ట్రేషన్లు లేని ఇళ్లకు హక్కు పత్రాలు కల్పించాలని,6. సెంట్రల్ నియోజకవర్గంలో ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేయాలని,7. ముత్యాలంపాడు -- అయోధ్యనగర్ మధ్య ఏలూరు కాలువపై వంతెన నిర్మించాలని,8. కొత్త రాజరాజేశ్వరిపేట -- పాత రాజరాజేశ్వరిపేట మధ్య ఆర్‌యూబీ ఏర్పాటు చేయాలని,9. మూతపడిన బీసీ హాస్టళ్లను తిరిగి పునఃప్రారంభించాలని,తీర్మానాలు చేసారు.విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ మహానాడు అనేది ప్రతి తెలుగు కార్యకర్తకు పండుగలాంటి కార్యక్రమమని పేర్కొన్నారు. 1982లో పార్టీ ఆవిర్భావం నుంచి మహానాడు పార్టీకి దిశానిర్దేశం చేసే వేదికగా కొనసాగుతోందన్నారు.కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా మహానాడును విజయవంతంగా నిర్వహించిన పార్టీ, ఇప్పుడు ఆధునిక టెక్నాలజీ ద్వారా ప్రతి కార్యకర్తను మహానాడుతో అనుసంధానం చేస్తోందన్నారు. బొండా ఉమా ఆధ్వర్యంలో 11 క్లస్టర్లలో మహానాడు వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.మహానాడు తీర్మానాలు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి దిశానిర్దేశం చేస్తాయని, పాత తరం అనుభవం -- కొత్త తరం ఆలోచనలు కలిసి పార్టీని మరింత బలోపేతం చేస్తున్నాయని చిన్ని తెలిపారు. ప్రతి తెలుగు కుటుంబం మహానాడులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సీఎం నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నాయకత్వంలో పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతోందన్నారు.మహిళా సాధికారతపై ప్రత్యేక తీర్మానం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. "స్త్రీ శక్తి" థీమ్‌తో నిర్వహించిన మహానాడులో మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని శివనాథ్ చెప్పారు.డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి మహిళలను స్వయం సమృద్ధి దిశగా నడిపించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. "దీపం", "తల్లికి వందనం", "దీపం 2.0", "స్త్రీ శక్తి" వంటి పథకాల ద్వారా మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నామని చిన్ని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ క్లస్టర్లు ఆలా తారక రామారావు, బత్తుల కొండా, వింజమూరి సతీష్, దాసరి కనకరావు, ఘంటా కృష్ణమోహన్, నెలిబండ్ల బాలస్వామి, పిన్నమనేని త్రిమూర్తి రాజు, సర్వే పల్లి అమర్నాథ్ గౌడ్, తొట్టెంపూడి ఉదయభాస్కర్, మరకా శ్రీనివాస్ యాదవ్, కంచి ధనశేఖర్, వెలగపూడి శ్రీను, ఇప్పిలి రామ్మోహన్, గుత్తి శ్రీనివాస చక్రవర్తి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిసర ప్రాంతాల టీడీపీ నాయకులు, మహిళా నేతలు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యాడికిలో ఘనంగా మహానాడు వర్చువల్ కార్యక్రమం

భారీగా తరలివచ్చిన తెలుగుదేశం శ్రేణులు



యాడికి మే 27 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలో మహానాడు వర్చువల్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయికి చెందిన వందలాది మంది ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అధినేత ప్రసంగాన్ని మరియు మహానాడు తీర్మానాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు నిర్వాహకులు ప్రత్యేకంగా భారీ డిజిటల్ స్క్రీన్లను, అధునాతన సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా డిజిటల్ తెరలపై ప్రసంగాలను వీక్షిస్తూ కార్యకర్తలు ఉత్సాహంగా నినాదాలు చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన శ్రేణులకు, అభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ముందస్తుగానే పగడ్బందీ ఏర్పాట్లు చేశారు. విచ్చేసిన ప్రతి ఒక్కరికీ మంచినీటి వసతితో పాటు నాణ్యమైన భోజన సదుపాయాలను కల్పించారు. నాయకులు, కార్యకర్తల భారీ కలయికతో యాడికి మండల కేంద్రంలో పండుగ వాతావరణం, రాజకీయ కోలాహలం నెలకొంది. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఈ సందర్భంగా ముఖ్య నాయకులు పిలుపునిచ్చారు

## రాజానగరం నియోజకవర్గం సీనియర్ జనసైనికుడు 'ముక్కా రాంబాబు'ని నిండు సభలో అభినందించిన అధినేత 'పవన్ కళ్యాణ్'..!!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ప్రియ శిష్యుడు కోరుకొండ మండలం జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్, మరియు జనవాణి ఇంచార్జి ముక్కా రాంబాబు పార్టీకి చేస్తున్న సేవలను, జనసేన పార్టీ సభ్యత్వాలను చేసిన తీరును గమనించిన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ అభినందించారు. పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ కి చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. రాజమండ్రిలో ఒక ప్రముఖ హోటల్ లో జరిగిన కార్యకర్తల సమావేశంలో రాజానగరం నియోజకవర్గశీ లో ముక్కా రాంబాబు పేరుని నిండు సభలో ప్రస్తావించి ఆయన్ని ప్రశంసించారు. ముక్కా రాంబాబు మాట్లాడుతూ తనకి ఈ గౌరవానికి కారణమైన బత్తుల బలరామకృష్ణకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా ముక్కా రాంబాబు కు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్డీయే శ్రేణులు తమ అభినందనలు తెలియజేశారు.

## ఆరోగ్య సేవలకు అండగా ఉదార విరాళం

పులిచెర్ల నూతన పీహెచ్‌సీ అభివృద్ధికి రూ.1.50 లక్షల సహాయం



పులిచెర్ల, మే 27,(నేటి శుభోదయ) : చిత్తూరు జిల్లా, పులిచెర్లలో త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానున్న నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అవసరమైన ఆధునిక పరికరాల కొనుగోలుకు కీర్తిశేషులు శ్రీ బి.వి.రెడ్డి కుటుంబ సభ్యులు, కీర్తిశేషులు శ్రీ వారణాసి మధుసూదన రెడ్డి సతీమణి వారణాసి సౌమినీ రెడ్డి రూ.1.50 లక్షల విరాళాన్ని అందజేశారు.ఈ మొత్తాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డికి అందించారు. ఆరోగ్య కేంద్ర అభివృద్ధికి సహకరించిన దాత కుటుంబానికి వైద్యాధికారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది వరసుబ్రమణ్యం, చంద్రయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవనాలకు తుమ్మల కుటుంబీకులు భూరి విరాళం

- కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ వేగినాటి విజయ్ కుమార్



ఖమ్మం, నేటి శుభోదయ :: ఖమ్మం రూరల్ మండలంలోని ఎం వెంకటాయపాలెం గ్రామంలో రెండు మహిళా సమాఖ్య భవనాలకు తుమ్మల కుటుంబీకులు బుధవారం భూ విరాళం ప్రకటించారు. మన గ్రామ పెద్దలు, సర్పంచ్ వేగినాటి విజయ్ కుమార్, పాలకవర్గ సభ్యులు వెళ్లి అడిగిన వెంటనే తమ యొక్క విలువైన 400 గజాల సొంత స్థలాన్ని మన గ్రామానికి మంజూరు చేస్తూ సుముఖత వ్యక్తం చేశారు. మహిళా సమైక్య 2 భవనాల నిర్మాణానికి మన గ్రామ పంచాయతీకి వితరణగా ఇచ్చినటువంటి స్థల దాతలను ఈ సందర్భంగా అభినందించారు. దాతలు అయినటువంటి తుమ్మల పెద్ద కన్నయ్య బసవమ్మ ల దంపతులు, తుమ్మల చిన్న కన్నయ్య(లేట్)వారి సతీమణి విజయ ల దంపతులు, తుమ్మల భద్రయ్య (లెట్)వారి భార్య నాగరత్నం ల కుమారుడు తుమ్మల వెంకటేశ్వర్లు, వారి సతీమణి వసంత లకు మన గ్రామ పంచాయతీ వెంకటాయపాలెం గ్రామ ప్రజల తరఫున ప్రత్యేకమైన కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు . మీరు చేసిన మేలు ఈ గ్రామ ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరు అని తెలిపారు.

## ప్రజా సేవలోనే రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ .. - కోరుకొండ కార్యాలయంలో అందుబాటులో ఉంటూ స్వయంగా అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే..!!

- కార్యాలయానికి పోటెత్తిన నియోజకవర్గ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు.. - రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ; లిరాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం ప్రజల చెంతనే ఉంటున్నారు. ఇందులో భాగంగా వారు కోరుకొండ కార్యాలయంలో అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలను స్వయంగా కలుసుకున్నారు.ఈ రోజు మధ్యాహ్నం నుండి కోరుకొండ కార్యాలయానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలు, జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి నాయకులు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యాలయానికి విచ్చేసిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే వారి వారి గ్రామాల్లో ఉన్న సమస్యలను, వ్యక్తిగత ఇబ్బందులను కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు.నియోజకవర్గ పరిధిలోని మౌలిక వసతులు, తాగునీటి ఎద్దడి, అంతర్గత రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, మరియు పింఛన్లు, రేషన్ కార్డుల వంటి పలు సామాజిక సమస్యలపై ప్రజల నుండి ఎమ్మెల్యే గారు స్వయంగా అర్జీలను (వినతిపత్రాలను) స్వీకరించారు. ప్రజా దర్బార్ తరహాలో సాగిన ఈ కార్యక్రమంలో అర్జీలు సమర్పించిన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన న్యాయం చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.ప్రజలు సమర్పించిన అర్జీలపై ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. పలు తీవ్రమైన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే ఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, త్వరితగతిన క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, ఆయా సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ.. మాట్లాడుతూ :రాజానగరం నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే నా ప్రధాన సంకల్పం. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా పనిచేస్తోంది. ప్రజలు తమ సమస్యల నివృత్తి కోసం ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా నన్ను సంప్రదించవచ్చు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఒక బాధ్యతగా తీసుకుని, పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షిస్తాం..కార్యాలయంలో ఎమ్మెల్యే తమకు అందుబాటులో ఉంటూ, తమ సమస్యలను ఓపికగా విని, అర్జీలు స్వీకరించడం పట్ల నియోజకవర్గ ప్రజలు మరియు కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# తెరచాటున దందా..!



( నేటి శుభోదయ : 27 ) విశాఖపట్నం జిల్లా గాజువాక (బి.హెచ్.పి.వి) జీవీఎంసీ 68వ వార్డు డోర్ నెంబర్ 2-1-8 రాంనగర్ పరిధిలో సచివాలయం కోడ్ : 457 అక్రమ నిర్మాణాలు... తెర'చాటు దందా జీవీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు అక్రమార్కులకు సహకరిస్తూ.. దాటవేత ధోరణి అవలంబిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతూ... నిబంధనల ప్రకారం బహుళ అంతస్తుల సముదాయాలకు సెట్ బ్యాక్ విడిచి పెట్టాలి. అదేవిధంగా అదనపు అంతస్తు నిర్మాణానికి జీవీఎంసీ నుంచి అనుమతులు తీసుకోవాలి. దీన్ని కోసం ప్రాంతాన్ని బట్టి రూ.15 లక్షలు వరకు జీవీఎంసీకి చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తం చెల్లించకుండా కొందరు భవన నిర్మాణ దారులు ఒక్కో భవనానికి కొంత మొత్తం పలువురు అధికారులకు ముట్ట చెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ వ్యవహారంలో క్షేత్రస్థాయిలోని కొందరు సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

## బిజెపి ద్రవ్యోల్బణ మంటకు ప్రజలకు చెమటలు

### ప్రధాని సూచనలపై ఖర్గే ఫైర్

న్యూఢిల్లీ : ఎండే మండలకు తగినంత నీరు తీసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు నీటిని తీసుకెళ్లాలని ప్రధాని మోడీ దేశ పౌరులకు జాగ్రత్తలు, సూచనలు చెప్పారు. ప్రధాని పౌరులకిచ్చిన సూచనలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికర్జున ఖర్గే ఫైర్ అయ్యారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం కేవలం ప్రజా సంక్షేమం గురించే మాట్లాడుతుంది తప్ప.. ద్రవ్యోల్బణం గురించి మాట్లాడదు.. మౌనం వహిస్తుంది అని ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టులో చేశారు. కాగా, 'మేము వేడిని తట్టుకోగలం, కానీ బిజెపి ప్రాయోజిత ద్రవ్యోల్బణం అనే మంటకు సామాన్య ప్రజలు చెమటలు పడుతున్నాయి. మీ సొంత ప్రభుత్వం చేస్తున్న దోపిడీ గురించి మీరెప్పుడూ మాట్లాడరా.. మోడీ గారూ?' అని ఖర్గే ఎక్స్ పోస్టులో ప్రధానిని ప్రశ్నించారు.

## ఇజ్రాయెల్ దాడిలో హమాస్ సైనికాధిపతి ఒడెహ్ మృతి

గాజా : మంగళవారం రాత్రి గాజా నగరంలోని రిమల్ ప్రాంతంపై ఇజ్రాయిల్ సైన్యం జరిపిన వైమానిక దాడిలో హమాస్ సైనికాధిపతి మొహ్మద్ ఒడెహ్ మృతి చెందారని ఇజ్రాయిల్ రక్షణ శాఖా మంత్రి ఇజ్రాయిల్ కాట్జ్ బుధవారం ధృవీకరించారు. 2023 అక్టోబర్7న ప్రారంభమై.. ఇప్పటివరకు కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకు నలుగురు హమాస్ ఆర్మీ కమాండర్‌లు చనిపోయారు. మే 15న హత్యకు గురైన హమాస్ కమాండర్ ఇజ్ అల్ దిన్ అల్ హద్దాద్ స్థానంలో ఒడెహ్ బాధ్యతలు స్వీకరించారు. అయితే ఈయన బాధ్యతలు స్వీకరించిన 11 రోజులకే ఇజ్రాయిల్ దాడులు చేసి ఒడెహ్‌ని హతమార్చడం గమనార్హం. కాగా, పాలస్తీనా గ్రూపు సాయుధ విభాగమైన ఖస్సాం బ్రిగేడ్స్ అధిపతిగా అతని స్థానంలో హమాస్ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ అయిన ఒడెహ్ నియమితులయ్యారని వార్తలొస్తున్నాయి. అయితే హమాస్ ఈ నియామకాన్ని అధికారికంగా ధృవీకరించలేదు. గాజా సిటీకి పశ్చిమాన రెమల్ ప్రాంతంలో మంగళవారం రాత్రి 9.30 గంటల సయమంలో ఇజ్రాయిల్ సైన్యం జరిపిన వైమానిక దాడుల్లో ఆరుగురు మృతి చెందారు. 20 మందికి గాయాలయ్యాయని అల్ షిఫా ఆసుపత్రి వర్గాలు మీడియాకు వెల్లడించారు. ఈద్ పండుగ సందర్భంగా రెమల్ మధ్యలో రద్దీగా ఉండే ప్రాంతంలో షాపింగ్ చేస్తున్న ప్రజల్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ మూడుచోట్ల దాడులు చేసిట్లు అల్ జజీరా విలేకరి హింద్ ఖౌదరి వెల్లడించారు. ఈ దాడుల్లో భారీ విధ్వంసం జరిగిందని ఆయన

## కేరళం మాజీ సిఎం నివాసం ఎదుట ఉద్రిక్తత

తిరువనంతపురం : కేరళం మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత పినరయి విజయన్ నివాసం ఎదుట ఉద్రిక్తత నెలకొంది. వివాదాస్పద ఎక్సాలాజిక్-సీఎంఆర్ఎల్ కేసులో విజయన్ నివాసంపై బుధవారం ఈడి దాడులకు దిగిన సంగతి తెలిసిందే. కన్నూర్, తిరువనంతపురంలోని ఆయన నివాసాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 12 ప్రాంతాల్లో దాడులు చేపట్టింది. ఈడి దాడులను వ్యతిరేకిస్తూ సిపిఐ(ఎం)కార్యకర్తలు తిరువనంతపురంలోని ఆయన అద్దె నివాసం ఎదుట ఆందోళన చేపట్టారు. కొందరు ఆందోళనకారులు ఈడి అధికారులు వెళ్తున్న వాహనాలను అడ్డుకుని, రాళ్లు రువ్వినట్లు సమాచారం. వాహనాల్లో మహిళా అధికారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, సిఆర్ పిఎఫ్ బలగాలు ఆందోళనకారులను అదుపుచేసేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారు. ఈ ఘటనలో వాహనం అద్దం కొంత మేర పగిలింది.

## సీబీఎస్ఈ త్రిభాషా విధానం.. కేంద్రానికి సుప్రీం నోటీసులు

ఢిల్లీ: సీబీఎస్ఈ త్రిభాషా విధానంపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. 2026--27 విద్యా సంవత్సరంలో 9,10 తరగతి విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు అభ్యసించాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణకు అంగీకరించిన సుప్రీం కోర్టు.. కేంద్రం, ఎన్‌సీఈఆర్టీ( చీజజు=)కి నోటీసులు ఇచ్చింది. ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్, న్యాయమూర్తులు జాయ్‌మల్య బాగ్చీ, విపుల్ ఎమ్ పంచోలిలతో కూడిన ధర్మాసనం.. రెండు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. కాగా, చదివే 3 భాషల్లో కనీసం 2 భారతీయ భాషలు ఉండాలని సీబీఎస్ఈ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. విద్యార్థుల భాషా నైపుణ్యం పెంపు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీబీఎస్ఈ వెల్లడించింది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇటీవల విడుదల చేసిన ఎన్‌సీఈఆర్‌టీ 9, 10 తరగతుల సిలబస్‌ను సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. అయితే, 2026--27 విద్యా సంవత్సరంలో తొమ్మిదవ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు అభ్యసించాలని సీబీఎస్ఈ ప్రకటించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. సీబీఎస్ఈ విద్యా సంవత్సరం ఇప్పటికే ప్రారంభమైంది. తరగతులు జరుగుతున్నాయి. మొదటి యూనిట్ పరీక్ష కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో 9వ తరగతికి త్రిభాషా సూత్రం అమలుపై విద్యావేత్తలు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల సన్నద్ధత, పాఠ్యపుస్తకాల లభ్యతను ప్రశ్నిస్తున్నారు. సీబీఎస్ఈ పునరాలోచన చేయాలని కోరుతున్నారు. హఠాత్తుగా కొత్త విధానం తీసుకురావడం, విద్యార్థులపై అనవసరంగా ఒత్తిడి పెంచడం సరైంది కాదని అంటున్నారు. త్రిభాషా సూత్రం జూలై 1 నుంచి అమల్లోకి వస్తుందని సీబీఎస్ఈ వెల్లడించింది.

# యుద్ధం: విషాదంతో పాటు విషం

యుద్ధం విషాదాన్నే కాదు.. విషాన్ని మిగులుస్తుంది. ప్రాణనష్టంతో మొదలై ప్రజలను నిరాశ్రయులను చేయడంతోపాటు మొత్తంగా పరిసరాల విధ్వంసానికి దారి తీస్తుంది. కానీ ఈ క్రమంలో తరచూ విస్మరించే మరో పరిణామం యుద్ధం మిగిల్చే కాలుష్యం. పై నష్టాలన్నీ యుద్ధం జరుగుతుండగా, జరిగిన వెంటనే తెలిస్తే.. కాలుష్యం ప్రభావం మాత్రం సంఘర్షణ ముగిసిన తర్వాత కూడా చాలా కాలం కొనసాగుతుంది. కొన్నిసార్లు దశాబ్దాలు పట్టొచ్చు. యుద్ధంలో తీవ్ర ప్రమాదాకానికి గురయ్యేవి మండే ఇంధనాలు, ప్రమాదకరమైన రసాయనాలుండే ఇంధన వ్యవస్థలు. దాడులు చమురు డిపోలు, రిఫైనరీలు, పైప్‌లైన్లలో మంటలను రాజేస్తాయి. ఈ మంటల వల్ల విష వాయువులు, క్యాన్సర్ కారక కణాలు, అవశేషాలు విడుదలై, చుట్టుపక్కల భూమి, నీరు సంవత్సరాల తరబడి కలుషితమవుతుంది. ఇరాన్ యుద్ధం విషయంలో ఇదే జరిగింది. ఇరాన్, గల్ఫ్‌లో ఇంధన మౌలిక సదుపాయాలపై జరిగిన బాంబు దాడులు ఇప్పటికే తీవ్ర నష్టాన్ని కలిగించాయి. మండుతున్న ఇంధన ట్యాంకులు విషపూరిత కణాలను గాలిలోకి పంపుతుండగా, వాటి శిథిలాలు, ప్రవాహాలు, చమురు అవశేషాలు గల్ఫ్ అంతటా తీరప్రాంత జలాలను, సముద్ర జీవావరణ వ్యవస్థలను భయపెడుతున్నాయి. ఈ కాలుష్య దాడి ప్రస్తుతం ఇక్కడికే పరిమితమైనా, తర్వాతి కాలంలో వ్యాప్తి విస్తృతంగా ఉంటుంది. ఇది ఎంతకాలం కొనసాగుతుందనే విషయాన్ని కూడా అంచనా వేయలేం.

### పారిశ్రామిక అగ్నిప్రమాదాలు

టెహ్రాన్ సమీపంలోని పలు చమురు డిపోలపై జరిగిన దాడులు, దాదాపు కోటి జనాభా ఉన్న పట్టణ ప్రాంతంపై దట్టమైన నల్లటి పొగను వ్యాపింపజేశాయి. చమురు మండటం వల్ల వెలువడే దట్టమైన పొగను ఇప్పుడు ఇరాన్‌లో చిన్నపిల్లలతో సహా ప్రజలు నేరుగా పీలుస్తున్నారు. ఈ పొగలో బెంజీన్, ఫార్మాల్డిహైడ్, పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్‌లు, ఇతర సూక్ష్మ కణ పదార్థాలు ఉంటాయి. ఇవి శ్వాసకోశంలోకి లోతుగా చొచ్చుకుపోయి, శ్వాసకోశ, హృదయ సంబంధ వ్యాధులను తీవ్రతరం చేస్తాయి. ఇది ఎక్కువకాలంపాటు కొనసాగితే ఈ ప్రభావాలు దీర్ఘకాలం ఉంటాయి. క్యాన్సర్ల ప్రమాదం పెరగడంతో పాటు, కొన్ని నాడీ సంబంధిత రుగ్మతలు వస్తాయి. ఇరాన్‌లో వాయు నాణ్యత ఇప్పటికే ప్రధాన పర్యావరణ సమస్యల్లో ఒకటిగా ఉంది. ఇక ఈ పారిశ్రామిక మంటలు లక్షలాది మంది ప్రజలు వాయు కాలుష్యం బారిన పడటానికి కారణమవుతాయి.

నేల కాలుష్యం, విషపూరిత శిథిలాలు

మందుగుండు సామగ్రి, సైనిక శిథిలాల పేలుడు దీర్ఘకాలిక నేల కాలుష్యానికి దారితీస్తుంది. బాంబు దాడికి గురైన ప్రాంతాల్లో సీసం, కాడ్మియం, నికెల్ లేదా క్రోమియం వంటి భారీ లోహాలు పేరుకుపోతున్నాయి. ఈ కాలుష్య కారకాలు నేలల్లో నిలిచిపోయి క్రమంగా ఆహార గొలుసులలోకి ప్రవేశిస్తాయి. కాలుష్యానికి మరో ప్రధాన కారణం ఆస్బెస్టాస్, పారిశ్రామిక రసాయనాలు, పేలని ఆయుధాల అవశేషాల శిథిలాలు, పట్టణ విధ్వంసం. సంఘర్షణానంతర కాలంలో ఈ పదార్థాల నిర్వహణ ప్రధాన పర్యావరణ సవాళ్లలో ఒకటిగా ఉంటుంది. ఉక్రెయిన్‌లో, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, పట్టణ ప్రాంతాలపై జరిగిన బాంబు దాడుల వల్ల అనేక కాలుష్య కారకాలు పర్యావరణంలోకి వ్యాపించాయి. గాజా స్ట్రిప్‌లో, భవనాలు, మౌలిక సదుపాయాల భారీ విధ్వంసం వల్ల లక్షలాది టన్నుల శిథిలాలు పేరుకుపోయాయి. ఇవి కాలుష్య నిర్మూలన, పునరి?నర్మాణ కార్యకలాపాలను క్లిష్టతరం చేస్తాయి. ధ్వంసమైన నగరాలను పునర్నిర్మించడం వాతావరణంపై అదనపు భారం పడుతుంది.

మరింత నీటి సంక్షోభం

యుద్ధం నీటి భద్రతను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఆనకట్టలు, కీలకమైన మౌలిక నీటి సదుపాయాలను ధ్వంసం చేసి జనాభాను నియంత్రించడానికి ప్రత్యర్థి దేశాలు చేస్తున్న ప్రయత్నాలు సంక్షోభాలకు దారితీస్తున్నాయి. కరువులు, వ్యవసాయంలో అధిక వినియోగం, వివాదాస్పద నీటి నిర్వహణ విధానాలతో ఇప్పటికే ఇరాన్ నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. యుద్ధం వల్ల ఏర్పడే కాలుష్యం నీటి నాణ్యతను దీర్ఘకాలికంగా ప్రభావితం చేయనుంది. పేలుళ్లు, అగ్నిప్రమాదాల కారణంగా హైడ్రోకార్బన్లు పట్టణ మురుగునీటి వ్యవస్థలలోకి, కొన్ని జలమార్గాల్లోకి ప్రవహించి, నేలలను, భూగర్భ జలాలను కలుషితం చేశాయి. ఇక విద్యుత్ గ్రిడ్‌లు, శుద్ధి కర్మాగారాలపై బాంబు దాడులు చేయడం వల్ల కీలకమైన నీటి శుద్ధి ప్రక్రియ నిలిచిపోతుంది. శుద్ధి చేయని నీటిని తాగడం వల్ల ప్రజలు తక్షణమే వ్యాధుల బారిన పడుతున్నారు. 1980లలో జరిగిన ఇరాన్--ఇరాక్ యుద్ధ సమయంలో గల్ఫ్‌లో సముద్రం పాలైన చమురు, ఆ ప్రాంతంలోని హాక్స్‌బిల్ సముద్ర తాబేళ్లు అంతరించడానికి, అక్కడి గ్రీన్ తాబేళ్ల వినాశనానికి కారణమైంది.

అంతరించనున్న అడవులు

సంఘర్షణ అటవీ నిర్మూలనకు దారి తీస్తుంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయి, ఇంధన కొరత ఏర్పడినప్పుడు, బొగ్గు, వంటచెరుకు వైపు మొగ్గు చూపాల్సి వస్తుంది. ఫలితంగా అడవులు అంతరించపోతాయి. ప్రత్యామ్నాయ ఇంధనాలు కనుమరుగైన చోట అడవుల నరికివేత పెరుగుతుంది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ సూడాన్. 2023లో ఇక్కడ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఖార్టూమ్, ఇతర పట్టణ ప్రాంతాల్లో చెట్ల విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది.

గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు

2022లో ప్రపంచవ్యాప్త గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల్లో సుమారు 5.5 శాతానికి సైనిక దళాలదే. ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం పెరిగేకొద్దీ, దాని వల్ల ఏర్పడే కర్బన్ ఉద్గారాలు కూడా పెరుగుతున్నాయి. 26 దేశాలు ఏడాది పొడవునా విడుదల చేసే ఉద్గారాల కంటే గాజా సంఘర్షణలో మొదటి 120 రోజుల్లోనే ఎక్కువ ఉద్గారాలు వెలువడ్డాయని ఒక పరిశోధనలో తేలింది. ఇరాన్ యుద్ధంలో జలాంతర్గామి కార్యకలాపాలు, సుదూర బాంబర్ దాడులు, క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. వీటివల్ల వెలువడే ఉద్గారాల భారం చాలా ఎక్కువ.

గల్ఫ్ యుద్ధంలోనూ

ఈ ప్రాంతం గతంలోనూ యుద్ధ కాలుష్యాన్ని చూసింది. 1991 గల్ఫ్ యుద్ధ సమయంలో, ఇరాకీ దళాలు 600 కంటే ఎక్కువ కువైట్ చమురు బావులకు నిప్పంటించాయి. నెలల తరబడి, దట్టమైన పొగ ఆకాశాన్ని కమ్మేసింది. దీంతో గల్ఫ్ అంతటా వాయు కాలుష్యం, నేల, భూగర్భ జలాల కాలుష్యం విస్తృతమైంది. అది అనేక అనారోగ్య సమస్యలకూ కారణమైంది. ఇందుకుగాను ఐక్యరాజ్యసమితి పరిహార కమిషన్‌కు నష్టపరిహారంగా ఇరాక్ 50 బిలియన్ డాలర్లకు పైగా చెల్లించింది.

ఉక్రెయిన్‌లోనూ

మరో భయంకరమైన తాజా ఉదాహరణ ఉక్రెయిన్. యుద్ధం ఒక విషపూరిత వాతావరణాన్ని సృష్టించింది. ఇక్కడ ఇంధన డిపోలు, పారిశ్రామిక ప్రాంతాలు, రసాయన గిడ్డంగులు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు దేశంలోని చాలా ప్రాంతాల్లో గాలి, నదులు, వ్యవసాయ భూములను కలుషితం చేశాయి. చమురు కేంద్రాల్లో మంటలు, అటవీ నిర్మూలన, దెబ్బతిన్న పారిశ్రామిక ప్రాంతాల నుంచి వెలువడిన కాలుష్యం నీటి వ్యవస్థల పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించింది.

# పెట్రో మంట

పది రోజుల్లో నాలుగుసార్లు పెట్రో ధరల పెంపు ద్వారా సామాన్యుడి జీవితాన్ని మరింత ప్రమాదంలోకి నెట్టేయడం ఆందోళనకరం. పొదుపు చర్యల పేరుతో ప్రధాని సుద్దులు చెప్పిన కొద్ది రోజులకే లీటర్ పెట్రోలు, డీజిల్ పై దాదాపు ఎనిమిది రూపాయలు పెంచడం ద్రవ్యోల్బణానికి మరింత ఆజ్యం పోయడమే. లీటర్ పై రూ.30 వరకూ పెంచితే తప్ప నష్టాల భర్తీ సాధ్యం కాదంటూ నిపుణుల పేరుతో కేంద్రం చేయిస్తున్న లీకులు... సామాన్యుడి బతుకును ఛిద్రం చేసేవే. పెట్రోలు, డీజిల్, సిఎన్ జి ధరలు పెరిగితే నిత్యావసర సరుకులతోపాటు ప్రయాణాలు ప్రియమవుతాయి. యావత్ మార్కెట్ తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఇప్పటికే ఆదాయాలు క్షీణిస్తున్న నేపథ్యంలో సామాన్యుల కష్టాలు మరింత పెరుగుతాయి. అయినా పాలకులు దెబ్బ మీద దెబ్బ కొడుతున్నారు. దశల వారీగా ధరలు పెంచుతున్నారు. ఏకపక్షంగా ఇరాన్ పై యుద్ధం ప్రారంభించిన అమెరికా, ఇజ్రాయిల్... పశ్చిమాసియాతోపాటు ప్రపంచాన్ని సంక్షోభంలోకి నెట్టేసింది. 90 శాతం ఇంధన దిగుమతులపై ఆధారపడిన, ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతి చేసుకునే దేశం భారత్. ఇందుకు అనుగుణంగా కేంద్రంలోని పాలకులు ఇంధన భద్రతకు ప్రాధాన్యత ఇచ్చారా అంటే అదీ లేదు. చైనా లాంటి దేశాలు భారీగా చమురును నిలువ చేసుకోగా, మోడీ సర్కారు రష్యా నుంచి చౌకగా కొనుగోలు చేసిన చమురును ప్రాసెసింగ్ చేసి, ఇతర దేశాలకు అమ్ముకునే కార్పొరేట్లకు వంతపాడటం మినహా చేసిందేమీ లేదు. గోదావరి బేసిన్ లోని చమురు నిక్షేపాలను రిలయన్స్ కు కట్టబెట్టారు. అందులో రాయల్టీగా మన రాష్ట్రానికి రావాల్సిన సగం వాటా అడిగే ధైర్యం కూడా టిడిపి, జనసేన పార్టీలకు లేకపోవడం గమనార్హం. కృష్ణా జిల్లా పామర్రులోని నిక్షేపాలు వేదాంతకు కట్టబెట్టేందుకు కసరత్తు జరిగిపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన దశాబ్దాల అనుభవం ఉన్న ఒఎన్ జిసి లాంటి సంస్థను పక్కనపెట్టి, తమిళనాట రక్తపాతం సృష్టించిన కంపెనీని ఎంపిక చేయడం ఎవరి ప్రయోజనాల కోసమో అందరికీ తెలిసిందే. ఒక నెల... మరో నెల... అంటూ అమెరికా బిచ్చమేసినట్లు అనుమతిస్తే... రష్యా నుంచి చేసిన కొనుగోళ్లను తాజా ఆంక్షలతో కేంద్రం నిలిపివేయడం ఆందోళనకరం. చౌకగా వస్తున్న రష్యా, ఇరాన్ చమురును కొనుగోలు చేయకుండా, అమెరికా, వెనిజులాల నుంచి దిగుమతి చేసుకోవడం స్వతంత్ర విదేశాంగ విధానానికి తిలోదకాలివ్వడమే. పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమై 74 రోజులు గడిచే వరకూ మన దేశంలో ఇంధన ధరలు పెరగకపోవడానికి ఐదు అసెంబ్లీల ఎన్నికలు కారణం. ఎన్నికల తరువాత ధరలు పెంచేస్తారని ప్రతిపక్షాలు చేసిన ప్రచారం నిజమని తాజాగా రుజువయింది.

2024 ఎన్నికల ముందు రూ.2 తగ్గించడం, ఈ ఏడాది ఐదు అసెంబ్లీల ఎన్నికల ముందు రూ.10 పన్నులను ఉపసంహరించుకుని చమురు కంపెనీలకు ఇస్తున్నట్లు ప్రకటించడం మోడీ సర్కారు ప్రజలను మోసగించే చర్యలే. ఉపసంహరించుకున్న రూ.10 కంపెనీలకు తగ్గించారే తప్ప నేరుగా కొనుగోలుదారులకు ఎటువంటి ప్రయోజనం కలిగించలేదు. తాజాగా మనదేశంలో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగ మంత్రి ఇంధన భద్రతకు భరోసా ఇస్తామని, ఎంత కొనుక్కుంటే అంత అమ్మడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. ఆ దేశం నిర్వాకం వల్లే దేశంలో ఇంధన భద్రత ప్రమాదంలో పడిందన్నది అందరికీ తెలిసిందే. దేశంలో విలువ ఆధారిత పన్ను (వ్యాట్) మన రాష్ట్రంలోనే అత్యధికంగా ఉంది. ఢిల్లీలో పెట్రోలు ధర రూ.99.51 ఉంటే రాష్ట్రంలో రూ.117.25 ఉంది. తాము అధికారంలోకి వస్తే వ్యాట్ తగ్గిస్తామని ఎన్నికల ముందు ప్రచారం చేసిన చంద్రబాబు, లోకేష్ ఇప్పుడు నోరు మెదపడం లేదు. ఇకపై పన్నులు పెంచబోమని ప్రకటించడంతోపాటు ప్రస్తుత ధరలు తగ్గించేలా కేంద్రంపైనా, వ్యాట్ తగ్గించేలా రాష్ట్రంపైనా ఒత్తిడి తెచ్చేందుకు పోరాటాలే మార్గం.



# అడవుల్లో పెరుగుతున్న ఆదివాసీ వైరుధ్యం

ములుగు జిల్లా మంగపేట మండలంలోని అడవి ప్రాంతాల్లో నివసిస్తున్న గొత్తికోయలపై ఇటీవల 'గో బ్యాక్' అనే నినాదం వినిపించడం కేవలం ఒక స్థానిక వివాదం కాదు.. ఇది భారతదేశంలో ఆదివాసీ హక్కులు, అటవీ పరిరక్షణ, అంతర్గత వలసలు, భద్రతా రాజకీయాలు, అభివృద్ధి నమూనా వంటి అనేక సంక్లిష్ట అంశాలను బయటపెడుతున్నది. ఒకవైపు స్థానిక ఆదివాసీ సంఘాలు, అటవీ అధికారులు 'అడవులను కాపాడాలి' అనే పేరుతో గొత్తికోయలను తిరిగి ఛత్తీస్‌గఢ్ పంపాలని డిమాండ్ చేస్తుండగా, మరోవైపు మానవ హక్కుల దృక్పథం నుండి చూస్తే ఇది నిరాశ్రయులైన ఆదివాసులపై పెరుగుతున్న సామాజిక వేరుచూపు రూపంగా కనిపిస్తోంది. అందువల్ల ఈ ప్రశ్నను భావో ద్వేగంతో కాకుండా విమర్శనాత్మక సామాజిక అవగాహనతో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### గొత్తికోయల వలస - ఒక చారిత్రక నేపథ్యం!

గొత్తికోయలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ అటవీ ప్రాంతాలకు చెందిన ఆదివాసీ సమూహం. 2005 తర్వాత అక్కడ సల్వా జుడుం పేరుతో సాగిన ప్రభుత్వ మద్దతు గల మిలీషియా చర్యలు, మావోయిస్టు-ప్రభుత్వ ఘర్షణలు వేలాది ఆదివాసీల జీవితాలను ఛిన్నాభిన్నం చేశాయి. గ్రామాల దహనం, బలవంతపు పునరావాసం, ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, భయాందోళనలు కారణంగా అనేక కుటుంబాలు తెలంగాణ అడవుల్లోకి వలస వచ్చాయి. అందువల్ల గొత్తికోయలు 'అవకాశాల కోసం వచ్చిన వలసదారులు' మాత్రమే కాదు. రాజకీయ-సైనిక ఘర్షణల వల్ల జీవనాధారాన్ని కోల్పోయిన అంతర్గత నిరాశ్రయులు. ఈ చరిత్రను పక్కనపెట్టి వారిని కేవలం 'అడవి ఆక్రమణ దారులు'గా చిత్రీకరించడం వాస్తవాన్ని సగం మాత్రమే చూడటం అవుతుంది.

### 'గో బ్యాక్' నినాదం ఎందుకు?

ఆ ప్రాంతంలో స్థానికంగా వినిపిస్తున్న ప్రధాన వాదన ఏమిటంటే, గొత్తికోయలు కొత్తగా అడవులను నరికి పోడు సాగు విస్తరిస్తున్నారు, అటవీ సంపదకు నష్టం కలుగుతోంది, వన్యప్రాణులపై ప్రభావం పడుతోంది, స్థానిక కోయ, నాయకపోడు వంటి ఆదివాసీల భూహక్కులపై ఒత్తిడి పెరుగుతోందని. ఈ ఆరోపణలను పూర్తిగా కొట్టి పారేయలేం. నియంత్రణలేని పోడు విస్తరణ పర్యావరణ సమస్యలకు దారి తీస్తుందనేది వాస్తవమే. అయితే ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అడవులను నాశనం చేస్తున్న శక్తులలో కేవలం పేద ఆదివాసులే ఉన్నారా? లేక మైనింగ్ కంపెనీలు, భారీ ప్రాజెక్టులు, రోడ్లు, కార్పొరేట్ అటవీ వినియోగం కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయా? భారతదేశంలో వేల ఎకరాల అడవులను పరిశ్రమలకు కేటాయించినప్పుడు పెద్దగా 'గో బ్యాక్' నినాదాలు వినిపించవు. కానీ జీవనోపాధి కోసం అడవిలో చిన్న భూమి సాగు చేసే ఆదివాసులపై మాత్రం తీవ్ర విమర్శలు కేంద్రీకృతమవుతాయి. ఇది అధికార వర్గాల రాజకీయ దృష్టికోణాన్ని ప్రతిబింబిస్తుంది.

### ఆదివాసీ ప్రజల మధ్య వైరుధ్యంగా..

ఈ సమస్యలో అత్యంత ఆందోళనకర అంశం ఏమిటంటే, ఇది ఇప్పుడు స్థానిక ఆదివాసులు, వలస ఆదివాసుల మధ్య ఘర్షణ రూపం దాల్చుతోంది. రాష్ట్రం, భద్రతా రాజకీయాలు, అటవీ విధానాలు సృష్టించిన సమస్య చివరకు రెండు పేద ఆదివాసీ వర్గాల మధ్య వైరుధ్యంగా మారుతోంది. అసలు సమస్య భూమి పంపిణీ అసమానత, అటవీ హక్కుల అమలులో వైఫల్యం, జీవనోపాధి సంక్షోభం, పునరావాస విధానాలు లేకపోవడం. కానీ చర్చ మాత్రం 'వాళ్లు బయటి వాళ్లు' అనే దిశగా మళ్లుతోంది. ఇది ప్రమాదకర పరిణామం. ఇది ఆదివాసీ ఐక్యతను బలహీనపరుస్తుంది. చరిత్రలో ఎన్నోసార్లు అధికార వర్గాలు.. పేదల మధ్య అంతర్గత విభజనలను పెంచి అసలు నిర్మాణాత్మక సమస్యల నుండి దృష్టి మళ్లించాయి. ఇప్పుడు కూడా అదే ప్రమాదం కనిపిస్తోంది.

### ప్రభుత్వ ద్వంద్వ వైఖరి..

ఈ వ్యవహారంలో ప్రభుత్వ వైఖరి కూడా విరుద్ధంగా కనిపిస్తోంది. ఒకవైపు గొత్తికోయలను అక్రమ ఆక్రమణ దారులని అంటున్నారు. మరోవైపు వారికి ఓటర్ కార్డులు, ఆధార్ కార్డులు, రేషన్ సౌకర్యాలు, రైతుబంధు నిధులు, భూ రికార్డుల్లో నమోదులు ఉన్నాయి. అంటే ఎన్నికల సమయంలో వారిని పౌరులుగా గుర్తించడం, తర్వాత అడవుల విషయంలో 'అక్రమ వలసదారులు'గా చూపిం చడం రాజకీయ ప్రయోజనాధారిత వైఖరిని సూచిస్తోంది. ఇది కేవలం పరిపాలనా విరుద్ధత మాత్రమే కాదు. భారతీయ ప్రజాస్వామ్యంలో అట్టడుగు వర్గాల పట్ల అధికార వ్యవస్థ ఎలా ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తుందో కూడా తెలియజేస్తుంది.

### 'శాంతి వచ్చింది' అంటే ఏమిటి?

మావోయిస్టు ప్రభావం తగ్గిందని, ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లో శాంతి నెలకొన్నందున గొత్తికోయలు తిరిగి వెళ్లాలని కొందరు వాదిస్తున్నారు.. కానీ తుపాకీ శబ్దాలు తగ్గి పోవడం మాత్రమే 'శాంతి' కాదు. నిజమైన శాంతి అంటే భూమి హక్కుల భరోసా, గౌరవప్రదమైన జీవితం, భద్రత, ఆరోగ్యం, విద్య, జీవనోపాధి అవకాశాలు ఉండాలి. ఇవి లేకుండా "ఘర్ వాపసీ" నినాదం కేవలం పరిపాలనా పరిష్కారంగా మాత్రమే మిగిలిపోతుంది. అదే విధంగా, పదహా రేళ్లుగా ఒక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను ఒక్కసారిగా 'తిరిగి వెళ్లండి' అని చెప్పడం మానవీయమైన పరిష్కారం కాదు. వారి పిల్లలు ఇక్కడే పెరిగారు. సామాజిక సంబంధాలు ఏర్పడ్డాయి. జీవనాధారం ఇక్కడే ఏర్పడింది. ఈ వాస్తవాలను విస్మరించి సమస్యను కేవలం 'అక్రమ ఆక్రమణ' కోణంలో చూడడం సరైన దారి కాదు.

### సమస్యను ఎలా అర్థం చేసుకోవాలి?

అందుకే 'గొత్తికోయలు గో బ్యాక్' అనే నినాదాన్ని రెండు కోణాల్లో అర్థం చేసుకోవాలి. ఒకవైపు స్థానిక ప్రజలు అడవుల నాశనం, భూముల ఒత్తిడి, జీవనాధారాల సంక్షోభంపై ఆందోళన చెందడం సహజం. ఈ భావనను పూర్తిగా తిరస్కరించడం సరైంది కాదు. మరోవైపు గొత్తి కోయల వలసకు కారణమైన చరిత్ర, రాష్ట్ర హింస, అభివృద్ధి నమూనా, అటవీ విధానాల వైఫల్యాన్ని కూడా గుర్తించాలి. లేకపోతే సమస్య మూల కారణాలు కనిపించవు. 'గో బ్యాక్' నినాదం ఒక భావోద్వేగ ప్రతిస్పందన కావచ్చు. కానీ అది సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. గొత్తికోయల సమస్యను మానవ హక్కులు, పర్యావరణ సమతుల్యత, స్థానిక ఆది వాసుల హక్కులు, అటవీ సంరక్షణ, అంతర్గత వలసల చరిత్ర ఈ అన్నింటినీ కలిపి చూడాల్సిన అవసరం ఉంది. లేకపోతే పేద ఆదివాసుల మధ్య ఘర్షణలు పెరుగుతాయి. కానీ అసలు సమస్యలు భూమి, అటవీ పాలన, అభివృద్ధి అసమానతలు, రాష్ట్ర వైఫల్యాలు అలాగే మిగిలిపోతాయి.

# రైతమ్మల శ్రమకు జేజేలు!

వ్యవసాయం, ఆహారోత్పత్తుల తయారీ, పంపిణీ రంగాల్లో మహిళలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారు. మహిళా శ్రమ తోడు లేకుండా వ్యవసాయం ఒక్క పూట కూడా ముందుకు సాగదు. ఆమె బహుపాత్రాభినయం చెయ్యకపోతే కుటుంబమూ వర్థిల్లదు. పొలాల్లో వ్యవసాయ పనులు, ఇంటి దగ్గర పశు పోషణతో పాటు అదనంగా వంట పనులు, ఇంటి పనులు, పెద్దల సంరక్షణ పనులను భుజాన వేసుకొని మోస్తున్న మహిళా రైతులు కొవ్వొత్తుల్లా కరుగుతూ సమాజ అభ్యున్నతికి దోహదపడుతున్నారు. మహిళా రైతులు ప్రత్యక్షంగా, పరోక్షంగా లింగపరమైన ప్రతిబంధకాలను, వివక్షలను, అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారు. ఈ లింగ అంతరాలను గుర్తించి, పరిష్కరిస్తే ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుంది. ఆహార అభ్రదత గణనీయంగా తగ్గుతుందని అధ్యయన నివేదికలు చెబుతున్నాయి. ఈ కొత్త సంవత్సరంలో ఆ దిశగా మీ ఆలోచనలు, ఆచరణకు పదును పెట్టండి అని ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. 2026ను అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరం (ఐవైడబ్ల్యూఎఫ్ 2026)గా ప్రకటించింది. ఆహార భద్రతను అందించటంలో మహిళలు - రైతుగా, రైతు కూలీగా, ఆహార పరిశ్రమదారుగా, ఉద్యోగిగా, అమ్మగా, కుటుంబ సభ్యుల సంరక్షకురాలిగా-బహుముఖ సేవలందిస్తున్నారు. ప్రపంచ వ్యవసాయ శ్రామిక శక్తిలో మహిళలకు గణనీయమైన భాగస్వామ్యం ఉంది. వ్యవసాయ, ఆహార విలువ గొలుసులో వీరి పాత్ర అత్యంత కీలకం. వ్యవసాయంలో, వ్యవసాయానుబంధ రంగాల్లో ఆహారోత్పత్తి, ప్రాసెసింగ్ పనుల నుంచి పంపిణీ, వాణిజ్య కార్యకలాపాల వరకు వ్యవసాయ, ఆహార విలువ గొలుసు పరిధిలోకి వస్తాయి. ఇంటి ఆహార భద్రత, పోషకాహారం సమకూర్చటంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. 2021లో వ్యవసాయ ఆహార రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా శ్రమిస్తున్న వారిలో 41% మహిళలైనప్పటికీ, మహిళల శ్రమ విలువను తక్కువగా చూస్తున్నారు. నడుములు పడిపోయే శ్రమతో కూడుకున్న పనులు చేయిస్తారు. కానీ, తక్కువ జీతం. భూమి, ఆర్థిక, సాంకేతికత, విద్య, విస్తరణ సేవలు తదితర అన్ని స్థాయిల్లో నిర్ణయాలు తీసుకునే విషయంలో వ్యవస్థాగత అడ్డంకులను మహిళా రైతులు ఎదుర్కొంటున్నారు. మహిళా రైతుల జీవన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావటానికి, లింగ సమానత్వాన్ని పెంపొందించడానికి, మహిళలను శక్తివంతం చేయడానికి.. తద్వారా వ్యవసాయాన్ని ఆహారోత్పత్తి రంగాలను మరింతగా ఒడిదుడుకుల్ని తట్టుకునేలా పటిష్టంగా నిర్మించడానికి అనుగుణంగా విధాన సంస్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించాలని ఐక్యరాజ్యసమితి లక్ష్యంగా పెట్టుకుంది. ఎఫ్ఏఓతో పాటు ఐరాస అనుబంధ సంస్థలైన ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐఎఫ్ఏడీ), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యుఎఫ్‌పీ)లు వచ్చే ఏడాదంతా మహిళా రైతులను బలోపేతం చేసే కార్యకలాపాలను సమన్వయం చేస్తాయి.




### 'మహిళా రైతు'లంటే ఎవరు?

వ్యవసాయ, ఆహార రంగాల్లో విభిన్న పాత్రల్లో పనిచేస్తున్న మహిళలందరూ మహిళా రైతులే. చిన్న/పెద్ద సొంత భూముల్లో పంటలు సాగు చేసే మహిళలు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, చేపలు/రొయ్యల రైతులు, మత్స్యకారులు, చేపల కార్మికులు, తేనెటీగల పెంపకందారులు, పశువులు/కోళ్ల పెంపకందారులు, ప్రాసెసర్లు, వ్యాపారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, గ్రామీణ వ్యవస్థాపకులు, సాంప్రదాయ విజ్ఞానవంతులు.. అధికారిక లేదా అనధికారిక పనిలో నిమగ్నమయ్యే మహిళలు.. భూమి యాజమాన్య హక్కులు ఉన్నా లేకున్నా సరే.. వీరంతా మహిళా రైతులే. వీరిలో యువతులు, వృద్ధులు, పేద, ఆదివాసీ మహిళలు, వైకల్యాలున్న మహిళలు, శరణార్థులు, వలస వచ్చి వ్యవసాయ, ఆహార శుద్ధి పనులతో పొట్టపోసుకుంటున్న మహిళలు కూడా ఈ కోవలోని వారే. వ్యవసాయ, ఆహార రంగాల్లో మహిళల స్థితిగతులు, లింగ అసమానతల స్థాయి, పర్యావరణ విపత్తుల నేపథ్యంలో మహిళలు ఎదుర్కొంటున్న అసమానతల వల్ల కలుగుతున్న ప్రమాదాలను ఎఫ్ఏఓ నివేదికలు నొక్కి చెబుతున్నాయి.

### మీకు తెలుసా?

ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయం, వ్యవసాయానుబంధ రంగాలు, ఆహార పరిశ్రమల్లో 2021లో పనిచేసే కార్మికుల్లో మహిళలు 41% ఉన్నారు. అయినప్పటికీ గ్రామీణ మహిళలు అసమానతను ఎదుర్కొంటున్నారు. మగ రైతులతో పోల్చితే చాలా మంది మహిళా రైతులు చిన్న కమతాల్లోనే సేద్యం చేస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఆహార పరిశ్రమల్లో పనిచేసే మహిళల సంపాదన పురుషుల కన్నా 22% తక్కువ. మహిళా రైతులపై పొలం పనులతో పాటు ఇంటి సంరక్షణ పని భారం అధికంగా ఉంటుంది. ఇంటి పనులకు ప్రత్యేక ఆదాయం ఉండదు. అసలు ఆ శ్రమ విలువ లెక్కలోకి రాదు. పని చేసినా ఆర్థిక సాధికారత రాదు. వారి శారీరక, మానసిక శ్రేయస్సును ఈ వేతనం లేని పని భారం దెబ్బతీస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికలు తమ కుటుంబ సభ్యుల కోసం చేసే వేతనం లేని సంరక్షణ పని విలువ ఏటా కనీసం 10.8 లక్షల కోట్ల డాలర్లని ఎఫ్ఏఓ లెక్కగట్టింది. ప్రణాళికాబద్ధమైన పథకాల ద్వారా గ్రామీణ మహిళలను సాధికారపరిస్తే 5.8 కోట్ల మంది ఆదాయం పెరుగుతుంది. 23.5 కోట్ల మందికి ఒడిదుడుకుల్ని తట్టుకునే శక్తి పెరుగుతుంది. అయినప్పటికీ ఈ దిశగా కృషి జరగటం లేదు. తీవ్రమైన వేడి, కరువుల నేపథ్యంలో పురుషుల కంటే మహిళలపై ఎక్కువ పని భారం పడుతుంది. లింగపరమైన అంతరాలను రూపుమాపితే ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి ఏటా లక్ష కోట్ల డాలర్ల మేరకు పెరుగుతుంది. 4.5 కోట్ల మంది ఎదుర్కొంటున్న ఆహార అభద్రతను తగ్గించవచ్చు. ఆహార అభద్రత బాధితుల్లో మహిళల సంఖ్యే ఎక్కువ. ఉపాధి, విద్యావకాశాలు, ఆదాయంలో లింగపరమైన అంతరం తగ్గించగలిగితే మహిళల్లో ఆహార అభద్రతను 52% తొలగించవచ్చని ఎఫ్ఏఓ నివేదిక తెలిపింది. మహిళలకు భూమి హక్కులు కల్పిస్తే వ్యవసాయ, ఆహార వ్యవస్థలు, గ్రామీణాభివృద్ధికి.. మొత్తంగా సమాజాభివృద్ధికి సహాయపడుతుంది. భూమి యాజమాన్య హక్కు విషయాల్లో లింగ వివక్ష రాజ్యం ఏలుతోంది. సాగు భూమిపై మహిళలకు మరింతగా హక్కులు కల్పిస్తే వారి సాధికారత, పెట్టుబడి సామర్థ్యం, స్థిరత్వం, సమస్యలను ఎదుర్కొనే శక్తి పెరుగుతుంది. భూమి హక్కున్న మహిళా రైతుకు సేవల లభ్యత మెరుగవుతుంది. లింగ ఆధారిత హింస తగ్గుతుందని ఎఫ్ఏఓ సూచిస్తోంది.

### గడ్డిభూముల సంవత్సరం కూడా !

2026ను మహిళా రైతుల సంవత్సరంతో పాటు గడ్డి భూములు, సంచార పశుకాపరుల సంవత్సరంగానూ ఉమ్మడిగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది. గడ్డి భూములు, సవన్నాలు, పొదలతో నిండిన బంజర్లు, ఎడారులు, చిత్తడి భూములు, కొండలు గుట్టలున్న ప్రాంతాల విస్తీర్ణం భూతలమ్మీద సగానికి సగం ఉంటుంది. ఈ ప్రాంతాలను పర్యావరణ హితమైన రీతిలో నిర్వహించటం జీవవైవిధ్యం, పచ్చదనం పరిరక్షణకు, కర్బన నిల్వలు, నీటి చక్రం నిర్వహణకు అవసరం. గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు వంటి సుమారు 100 కోట్ల పశు వులను బంజరు భూములు, పచ్చికబయళ్లలో మేపుకుంటూ ఎంతో మంది సంచార పశుకాపరులు తరతరాలుగా జీవనం సాగిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా భూముల్లో దాగి ఉన్న కర్బన నిల్వల్లో 30% ఈ భూముల్లోనే ఉంది. భూతాపం పెరగటం వల్ల ఈ భూముల్లోని సగం కర్బనం వాతావరణంలో కలిసినట్లు అంచనాలు ఉన్నాయి. ఫలితంగా ఈ భూములపై ఆధారపడి ఉన్న ప్రజల జీవనోపాధులు ప్రమాదంలో పడుతున్నాయి. గడ్డి భూములు, చిత్తడి నేలల పరిరక్షణకు పాలకులు శ్రద్ధతీసుకొని పెట్టుబడులు పెట్టాలని ఎఫ్ఏఓ పిలుపునిచ్చింది. ఈ భూములను పరిరక్షించటం ద్వారా పంట పొలాలకూ మేలు జరుగుతుంది.

# వ్యర్థాలుగా కాదు.. వెలుగుల దిశగా అడుగులు

ఎలక్ట్రిక్ వాహనాల వాడకం ఏటా పెరుగుతోంది. వాహనదారుల్లో పర్యావరణంపై అవగాహన అధికమవుతోంది. భారత రోడ్లపై గతేడాది దాదాపు 15 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ వాహనాలు రోడ్డెక్కడం పర్యావరణ స్పృహకు నిదర్శనం. అయితే, ఈ వాహనాల్లో కీలక భాగంగా ఉన్న 'లిథియం-అయాన్' బ్యాటరీల ఆయుష్షు తీరిపోయాక పరిస్థితి ఏంటి అనేది ఇప్పుడు ప్రశ్న. తాజా అంచనాల ప్రకారం 2030 నాటికి దేశంలో ఏటా 50,000 టన్నులకు పైగా బ్యాటరీ వ్యర్థాలు పోగుపడనున్నాయి. కానీ, ఈ వ్యర్థాలను పర్యావరణ ముప్పుగా కాకుండా ఒక అద్భుతమైన ఆర్థిక అవకాశంగా మార్చే దిశగా భారత్ అడుగులు వేస్తోంది.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 'బ్యాటరీ వ్యర్థాల నిర్వహణ సవరణ నిబంధనలు (2024)' ఈ రంగంలో సరికొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి. కేవలం రీసైక్లింగ్ మాత్రమే కాకుండా ఈ పాత బ్యాటరీలను 'సెకండ్ లైఫ్' కింద కొన్ని మార్పులు చేసి మారుమూల గ్రామాల్లో సోలార్ గ్రిడ్లుగా, వ్యవసాయ పంపు సెట్లకు ఎనర్జీ సోర్స్‌లుగా మలచవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### పెరుగుతున్న బ్యాటరీలు

ప్రస్తుతం వినియోగిస్తున్న లిథియం-అయాన్ బ్యాటరీల జీవితకాలం సాధారణంగా 8 నుంచి 10 ఏళ్లు. భారత ప్రభుత్వం ఫేమ్ 2 పథకం ద్వారా ఈవీలను ప్రోత్సహిస్తున్న తరుణంలో వచ్చే దశాబ్ద కాలంలో లక్షలాది టన్నుల బ్యాటరీ వ్యర్థాలు పోగుపడతాయని అంచనా. వీటిని సరైన పద్ధతిలో నిర్వహించకపోతే అందులోని రసాయనాలు భూగర్భ జలాలను, పర్యావరణాన్ని కలుషితం చేసే ప్రమాదం ఉంది.

### రీసైక్లింగ్ ప్రక్రియ

బ్యాటరీలను కేవలం వ్యర్థాలుగా చూడకుండా రీసైక్లింగ్ ద్వారా కలిగే ప్రయోజనాలపై దృష్టి సారించాలి. కొన్ని పద్ధతుల ద్వారా పాత బ్యాటరీల నుంచి లిథియం, కోబాల్ట్, నికెల్, మాంగనీస్ వంటి విలువైన లోహాలను 90% పైగా తిరిగి పొందవచ్చు. భారతదేశంలో లిథియం నిల్వలు తక్కువ. రీసైక్లింగ్ పెరిగితే ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 'బ్యాటరీ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ (2022)' ప్రకారం తయారీదారులే బ్యాటరీల సేకరణ, రీసైక్లింగ్‌కు బాధ్యత వహించాలి.

### బ్యాటరీలకు 'సెకండ్ లైఫ్'

అన్ని బ్యాటరీలను వెంటనే రీసైక్లింగ్ చేయాల్సిన అవసరం లేదు. ఈవీల్లో బ్యాటరీ సామర్థ్యం 70-80% కి పడిపోయినప్పుడు అవి వాహనానికి పనికిరావు కానీ, ఇతర అవసరాలకు అవి మెరుగ్గా పని చేస్తాయి. దీనినే సెకండ్ లైఫ్ అప్లికేషన్లు అంటారు. రీసైకిల్ చేయకుండానే ఈ బ్యాటరీలను గ్రామీణ ప్రాంతాల్లో విభిన్న అవసరాలకు ఉపయోగించవచ్చు.

సోలార్ మైక్రో గ్రిడ్లు: గ్రామాల్లో సోలార్ ప్యానెల్స్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును నిల్వ చేయడానికి ఈ పాత ఈవీ బ్యాటరీలను ఉపయోగించవచ్చు. పగలు నిల్వ చేసిన విద్యుత్తును రాత్రి పూట వీధి దీపాలకు, ఇళ్లకు వాడుకోవచ్చు.




వ్యవసాయ పంపు సెట్లు: పొలాల్లో సోలార్ పంపు సెట్లకు బ్యాటరీ స్టోరేజ్‌గా వీటిని అనుసంధానిస్తే విభిన్న వాతావరణ పరిస్థితులున్న సమయంలో కూడా నీటి సరఫరా ఆగదు.

బ్యాకప్ పవర్: గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్లో ఇన్వర్టర్ల స్థానంలో ఈ బ్యాటరీ ప్యాక్‌లను తక్కువ ధరకే ఏర్పాటు చేయవచ్చు.

నీతి ఆయోగ్ నివేదికల ప్రకారం, 2030 నాటికి భారతదేశంలో బ్యాటరీ రీసైక్లింగ్ మార్కెట్ విలువ బిలియన్ డాలర్ల(సుమారు రూ.9000 కోట్లు)కు చేరుకుంటుంది. ఈ క్రమంలో పాత బ్యాటరీలను గ్రామీణ విద్యుదీకరణకు వాడటం వల్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యం సులభమవుతుంది. 2027-28 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త బ్యాటరీల తయారీలో కనీసం 5% రీసైకిల్ చేసిన పదార్థాలను వాడాలనే నిబంధనను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), లోహమ్ వంటి సంస్థలు ఇప్పటికే పాత ఈవీ బ్యాటరీలను ఎనర్జీ స్టోరేజ్‌లుగా మార్చి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ప్రయోగాలు చేస్తున్నాయి. రీసైక్లింగ్ ద్వారా లభించే లిథియం, కోబాల్ట్ ధరలు కొత్త ఖనిజాల తవ్వకం కంటే 25% తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇది ఈవీల ధరలు తగ్గడానికి కూడా దోహదపడుతుంది.

# సామాన్యుడి చేతిలో సమస్తం!




ఒకప్పుడు కంప్యూటర్ అంటేనే వింతగా చూసిన పల్లె ప్రజలు ఇప్పుడు తమ చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌తో ప్రపంచంలోని అన్ని విషయాలు తెలుసుకుంటున్నారు. టెక్నాలజీ పుణ్యామా అని ఇప్పుడు చాలా మందికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అందుబాటులోకి వచ్చింది. చాట్‌జీపీటీ, జెమిని.. వంటివి కేవలం నగరాలకో, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకో పరిమితం కాలేదు. పంటకు పట్టిన తెగులును ఫోటో తీసి పరిష్కారం అడిగే రైతు నుంచి, ప్రభుత్వ పథకాల వివరాలను మాతృభాషలో అడిగి తెలుసుకునే సామాన్యుడి వరకు.. ఏఐ నేడు ఒక డిజిటల్ సహాయకుడిలా మారుతోంది. ఇంగ్లీష్ రాకపోయినా, టెక్నాలజీపై అవగాహన లేకపోయినా.. కేవలం మాటతోనే పనులు పూర్తి చేసుకునేలా ఏఐ అందుబాటులోకి వస్తోంది.

### సామాన్యుల కోసం టెక్ కంపెనీల వ్యూహాలు

చదవడం, రాయడం రాని వారు కూడా తమ మాతృభాషలో మాట్లాడి సమాచారాన్ని పొందేలా గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు వాయిస్ అసిస్టెంట్లను అభివృద్ధి చేశాయి. మైక్రోసాఫ్ట్ అభివృద్ధి చేసిన భాషిణి వంటి ప్రభుత్వ ఏఐ ప్రాజెక్టులు, గూగుల్ '1,000 ల్యాంగ్వేజీ ఏఐ మోడల్' ద్వారా స్థానిక మాండలికాల్లో ఏఐ సర్వీసులు అందిస్తున్నారు. కొత్త యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం కష్టంగా భావించే వారి కోసం నేరుగా వాట్సాప్ చాట్‌బాట్ల ద్వారా ఏఐ సేవలను అందుబాటులోకి తెస్తున్నారు.

### గ్రామ స్థాయిలో ఏఐ ఎలా ఉపయోగపడుతుంది?

వ్యవసాయానికి సంబంధించి నేల స్వభావం, వాతావరణ మార్పులను బట్టి ఏ పంట వేయాలి? ఎప్పుడు నీరు పెట్టాలి? పురుగుల మందు ఎప్పుడు చల్లాలి? వంటి అంశాలను ఏఐ ముందే సూచిస్తుంది. ఉదాహరణకు, పంట ఆకు ఫోటో తీసి ఏఐ యాప్‌లో పెడితే దానికి ఉన్న సమస్యలు ఏమిటో, ఏ మందు వాడాలో వెంటనే చెబుతుంది. గ్రామాల్లో డాక్టర్ల కొరత ఉంటుంది. ఏఐ ఆధారిత డయాగ్నోస్టిక్ టూల్స్ ద్వారా ప్రాథమిక పరీక్షలు నిర్వహించి తీవ్రతను బట్టి నగరంలోని డాక్టర్లకు సమాచారాన్ని పంపవచ్చు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి తమ సొంత భాషలో అడిగి తెలుసుకోవడానికి ఏఐ చాట్‌బాట్లు సహాయపడుతున్నాయి.

### ఏఐని సులువుగా ఎలా వాడవచ్చు?

స్మార్ట్‌ఫోన్‌లో ఏదైనా ఏఐను అడగాలంటే టైప్ చేయడం కష్టమైతే కీబోర్డ్ పైన లేదా సెర్చ్ బార్‌లో ఉండే మైక్ బటన్ నొక్కి మీకు కావాల్సిన విషయాన్ని అడగాలి. గూగుల్ లెన్స్ వంటి ఏఐ టూల్స్ వాడి ఏదైనా తెలియని వస్తువును లేదా మొక్కను ఫోటో తీసి దాని వివరాలు తెలుసుకోవచ్చు. మీకు రాని భాషలో ఏదైనా ఉత్తరం లేదా బోర్డు ఉంటే, ఏఐ కెమెరా ద్వారా దాన్ని వెంటనే కావాల్సిన భాషలోకి మార్చుకోవచ్చు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది కేవలం చదువుకున్న వారి కోసం మాత్రమే కాదు, దీన్ని అందరి కోసం తయారు చేస్తున్నారు. ముఖ్యంగా భారతీయ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ఏఐ విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదు. డిజిటల్ అక్షరాస్యత పెంచడంతో పాటు భాషా పరమైన అడ్డంకులను తొలగిస్తే ఏఐ ఒక సామాన్యుడి

# ఎక్కువ కాలం బతకడం కాదు.. బతికినంత కాలం రోగాలు లేకుండా ఉండడమే ముఖ్యం.. సైంటిస్టుల అధ్యయనాలు..

ఆయుష్షు ఎంతకాలం ఉంటుంది అన్నది కేవలం జన్యువులపై మాత్రమే ఆధారపడదని, జీవనశైలి, రోజువారీ అలవాట్లు కూడా పెద్ద పాత్ర పోషిస్తాయని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. ఆరోగ్యంగా ఎక్కువకాలం జీవించడం అనేది ఇప్పుడు వైద్య రంగంలో ప్రధాన చర్చగా మారింది. ముఖ్యంగా వ్యాయామం, ఆహారం, నిద్ర, ఒత్తిడి నియంత్రణ, ధూమపానం, మద్యం వినియోగం, సామాజిక సంబంధాలు వంటి అంశాలు ఆరోగ్యకర వృద్ధాప్యంపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల ఆక్స్‌ఫర్డ్‌లో నిర్వహించిన స్మార్ట్ ఏజింగ్ సమ్మిట్‌లో విడుదలైన నివేదిక ప్రకారం, మనుషుల ఆరోగ్యకరమైన ఆయుష్షుపై వారి నియంత్రణ ఇప్పటివరకు అనుకున్నదానికంటే చాలా ఎక్కువగా ఉందని వెల్లడైంది. దీర్ఘాయుష్షు అంటే కేవలం ఎక్కువ సంవత్సరాలు జీవించడం మాత్రమే కాకుండా, వ్యాధులు లేకుండా ఆరోగ్యంగా జీవించే సంవత్సరాలను పెంచడం అని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు.

### ధూమపానం ప్రమాదకరమైన అలవాట్లలో ఒకటి..


నివేదిక ప్రకారం ధూమపానం ఇప్పటికీ అత్యంత ప్రమాదకర అలవాట్లలో ఒకటిగా ఉంది. ఇది అనారోగ్యకర వృద్ధాప్యానికి ప్రధాన కారణంగా మారుతోందని హెచ్చరిస్తున్నారు. వృద్ధాప్యంలో గుండె జబ్బులు, క్యాన్సర్, మతిమరుపు, డయాబెటిస్, ఊబకాయం వంటి సమస్యలకు జన్యువులు కొంతమేర ప్రభావం చూపినా, జీవనశైలి మరింత కీలకంగా మారుతోంది. బాల్యం నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరుచుకోవడం, మధ్యవయస్సు తర్వాత వాటిని కొనసాగించడం ఎంతో ముఖ్యమని నివేదిక పేర్కొంది. పలు విస్తృత అధ్యయనాల ప్రకారం మనుషుల ఆయుష్షులో జన్యువుల ప్రభావం పరిమితంగానే ఉంటుందని, పర్యావరణం, ప్రవర్తనా అలవాట్లు మరింత ప్రభావం చూపుతున్నాయని వెల్లడైంది. దశాబ్దాల పాటు కొనసాగిన అలవాట్లు గుండెజబ్బులు, టైప్-2 డయాబెటిస్, కొన్ని రకాల క్యాన్సర్లు, ఊబకాయం, మతిమరుపు వంటి సమస్యల ప్రమాదాన్ని ప్రభావితం చేయగలవని నిపుణులు చెబుతున్నారు. కుటుంబ చరిత్రలో వ్యాధులు ఉన్నప్పటికీ ఆరోగ్యకర జీవనశైలి వల్ల గణనీయమైన లాభాలు పొందవచ్చని వారు సూచిస్తున్నారు.

### నిత్యం వ్యాయామం చేయాలి..

నిత్య వ్యాయామం ఆరోగ్యకర వృద్ధాప్యానికి అత్యంత ముఖ్యమైన అంశాల్లో ఒకటిగా గుర్తించబడుతోంది. క్రమం తప్పకుండా నడక, తేలికపాటి వ్యాయామం వంటి శారీరక చలనం గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర నియంత్రణ, కండరాల బలం, మెదడు పనితీరు, మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. రోజూ కొద్దిసేపు నడవడం కూడా దీర్ఘకాలిక వ్యాధులు, అకాల మరణాల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. నిద్ర, ఒత్తిడి కూడా ఆయుష్షుపై ప్రభావం చూపుతున్న కీలక అంశాలుగా మారాయి. సరైన నిద్ర లేకపోతే అధిక రక్తపోటు, ఊబకాయం, డిప్రెషన్, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు), కార్టిసోల్ స్థాయిలు పెరిగి గుండె, మెటబాలిక్ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భావోద్వేగ సమతుల్యత, విశ్రాంతి, సామాజిక మద్దతు కూడా ఆరోగ్యకర వృద్ధాప్యంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని చెబుతున్నారు.

### సమతుల్య ఆహారం కూడా..

ఆహారపు అలవాట్ల విషయంలో కూడా సమతుల్యమైన పోషకాహారం కీలకమని పరిశోధకులు చెబుతున్నారు. కూరగాయలు, పండ్లు, పూర్తి ధాన్యాలు, పప్పులు, డ్రైఫ్రూట్స్, ఆరోగ్యకర కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహారం దీర్ఘాయుష్షుతో సంబంధం కలిగి ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. మరోవైపు అధికంగా ప్రాసెస్డ్ ఫుడ్స్, చక్కెర పానీయాలు, ధూమపానం వంటి అలవాట్లు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. ఒంటరితనం, సామాజిక దూరం కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి. మంచి సామాజిక సంబంధాలు మానసిక ధైర్యం, తక్కువ ఒత్తిడి, మెరుగైన మెదడు ఆరోగ్యం, ఆరోగ్యకర అలవాట్లకు మద్దతు ఇస్తాయి. భావోద్వేగ ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం పరస్పరం అనుసంధానమై ఉంటాయి. ఆరోగ్యకర అలవాట్లు జీవితంలో ఆలస్యంగా ప్రారంభించినా ప్రయోజనాలు పొందవచ్చు. ధూమపానం మానేయడం, శారీరక చలనం పెంచడం, బరువు నియంత్రణ, మద్యం తగ్గించడం, నిద్ర మెరుగుపరచడం వంటి మార్పులు ఏ వయసులో ప్రారంభించినా ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచవచ్చు. ఆధునిక దీర్ఘాయుష్షు పరిశోధనలు ఇప్పుడు హెల్త్‌స్పాన్ పై ఎక్కువ దృష్టి పెడుతున్నాయి. అంటే ఎక్కువకాలం బ్రతకడం మాత్రమే కాదు, ఆ కాలాన్ని ఆరోగ్యంగా, స్వతంత్రంగా గడపడం ముఖ్యం. వృద్ధాప్యంలో బలహీనత, దీర్ఘకాలిక వ్యాధులు, ఇతరులపై ఆధారపడే పరిస్థితులను తగ్గించడం కూడా దీర్ఘాయుష్షు లక్ష్యాల్లో భాగమేనని పేర్కొంటున్నారు.



NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .